

PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక



ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 06 | మంగళవారం 07, ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari



### ఒంటిమిట్టలో ముగిసిన

## బ్రహ్మోత్సవాలు

### వైభవంగా పుష్పయాగం నిర్వహణ

ఒంటిమిట్ట, ఏప్రిల్ 6 : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ముంగింపుదశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా నిర్వహించిన పుష్పయాగం అత్యంత వైభవంగా సాగింది. ఆదివారం సాయంత్రం పుష్పయాగ మహోత్సవం భక్తి భరితంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, ఆలయ శుద్ధి, నిత్యారాధనలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం వైభవంగా ప్రారంభమైంది. తులసీదళాలు, మల్లెలు, రోజాలు, చామంతులు, గన్నేరు, సంపంగి, మొగలి

2 లో

## రాష్ట్రపతి వద్దకు అమరావతి బిల్లు

### - పరిశీలన అనంతరం సంతకం చేసే అవకాశం

న్యూఢిల్లీ,ఏప్రిల్6 : రాజధాని అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పించే దిశగా కీలక ముందడుగు పడింది. పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ బిల్లు–2026.. సోమవారం రాష్ట్రపతి భవన్‌కు చేరుకుంది. లోక్ సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపింది. పరిశీలన, న్యాయ నిపుణులతో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ఆమోదం తెలపనున్నారు. రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఇది చట్టరూపం దాల్చనుంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ 2026 బిల్లుకు పార్లమెంట్ ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. సుమారు ఐదు గంటల పాటు లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లుపై చర్చలు జరిగాయి. ఎలాంటి సవరణలు లేకుండానే బిల్లుకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ఉభయ సభల ఆమోదం తర్వాత లోక్‌సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి వద్దకు పంపింది. ఇవాళ రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఈ బిల్లు రాష్ట్రపతి పరిశీలనలో ఉంది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపిన అనంతరం రాష్ట్రపతి సంతకం చేయనున్నారు. రాష్ట్రపతి ఆమోదం తర్వాత హిందీ, ఆంగ్ల భాషల్లో గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది.

## తమిళనాడులో తండ్రీ కొడుకుల లాకప్‌డెత్ కేసు

### - 9మంది పోలీసులకు మధురై కోర్టు ఉరిశిక్ష ఖరారు


చెన్నై,ఏప్రిల్ 6 : లాకప్ డెత్ కేసులో మధురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బాధ్యులైన 9మంది పోలీసుకలు ఉరిశిక్ష విధిస్తూ తీర్పుని ఇచ్చింది. తమిళనాడులోని తూతుకుడి జిల్లా సాతాన్‌కుళంకు చెందిన తండ్రీ కుమారుల లాకప్ డెత్ కేసులో మదురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తొమ్మిది మంది తమిళనాడు పోలీసులకు మరణశిక్ష విధించింది. 2020 జూన్ 19న లాక్‌డౌన్ సమయంలో అనుమతించిన సమయానికి మించి మొబైల్ షాప్ నడిపారన్న ఆరోపణలతో యజమాని జయరాజ్, ఆయన కుమారుడు బెనిక్స్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కస్టడీలో ఉన్న వారిని తీవ్రంగా హింసించడంతో ఇద్దరూ చనిపోయారు. ఈ ఘటనకు పాల్పడిన తొమ్మిది మంది పోలీసులపై ఉన్నతాధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తాజాగా తీర్పు వెలువరించింది. కొవిడ్ కారణంగా 2020లో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించిన విషయం తెలిసిందే. అదే ఏడాది జూన్ 19న లాక్‌డౌన్ సమయంలో అనుమతించిన

2 లో

### నీటిని దాచుకోవడం

# నేర్చుకోవాలి

- భూమిలో నీరు ఇంకితేనే సేద్యానికి సాధ్యం
- నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలి
- నీటి భద్రతలో రైతులు భాగస్వామ్యం కావాలి
- గతంలో ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు చేపట్టాం
- మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- 'నీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యత'లో సిఎం చంద్రబాబు
- మావిగన్ పేరుతో అమరావతిని అడ్డుకునే కుట్రలు అంటూ విమర్శలు





అనంతపురం, ఏప్రిల్ 6 : బ్యాంక్‌లో నగదు దాచుకున్నట్లు మనం నీటిని భూమిలో దాచుకోవాలని రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలని సీఎం చంద్రబాబు కోరారు. భూమినే ఒక జలాశయంగా మార్చుకోవాలన్నారు. అనంతపురం జిల్లా యాడికిలో చంద్రబాబు పర్యటించారు. 'నీటి భద్రత– సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంలో పాల్గొన్నారు. సాగునీటి సంఘాలు, రైతులతో సమావేశమయ్యారు. వర్షపు నీటి విలువ రాయలసీమ రైతులకు బాగా తెలుసని అన్నారు. నీటిని సంరక్షించుకోవడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టామని స్పష్టం చేశారు. పరిగెత్తే నీటిని నిలబెట్టాలి.. నిలబడిన నీటిని నిల్వ చేయాలి.. జలాశయాలు నింపేందుకు ప్రయత్నించాలన్నారు. ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, తుంపర సేద్యం, సూక్ష్మసేద్యం వంటివి గతంలో చేపట్టామని చంద్రబాబు వివరించారు. నీటి కుంటలు, కాలువలు, చెరువుల్లో మట్టి తీసి పొలాల్లో వేశామని ఏపీ సీఎం గుర్తు చేశారు. నీటి భద్రతా కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని రైతులు, సాగునీటి సంఘాలకు సూచించారు. మైక్రో ఇరిగేషన్‌లో తాము చేసింది.. దేశం మొత్తం అనుసరించిందని అన్నారు. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్‌లో రూ. 1,031 కోట్లు ఖర్చు చేస్తూ దేశంలో నంబర్ వన్‌గా ఉన్నామన్నారు. గతంలోనే ఇంకుడుగుంతలు, పంటకుంటలు తవ్వించాం. ఎన్టీఆర్ జలసిరి, నీరు–మీరు, నీరు ప్రగతి తీసుకువచ్చాం. మైక్రో ఇరిగేషన్‌లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం. రాయలసీమలో 63 శాతం పంటలను మైక్రో ఇరిగేషన్ కిందికి తీసుకొచ్చాం. మైక్రో, డ్రిప్ ఇరిగేషన్ వల్ల రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌గా తయారైంది. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తాం. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం. రాష్ట్రంలోని జలాశయాలన్నీ జలకళ సంతరించుకున్నాయి. నీటిని నిల్వ చేసుకుంటే చాలు.. అదే సంపద సృష్టిస్తుందని చంద్రబాబు అన్నారు. గత ఏడాది వేసవి ముందు 8, వేసవి తర్వాత 3

2 లో

### ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్

## మాజిద్ ఖదేమీ హతం

- ప్రకటించిన ఇరాన్ మీడియా - యుద్ధంలో ఇరాన్‌కు మరో గట్టి దెబ్బ
- ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ హతం - అధికారికంగా ప్రకటించిన ఇరాన్ మీడియా




టెహరాన్, ఏప్రిల్ 6 : హోర్ముజ్ జలసంధిని తెరవకపోతే మీ అంతు చూస్తామన్న డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు ఇరాన్ ఘాటుగా బదులిచ్చింది. హోర్ముజ్ జలసంధిని బేషరతుగా తెరవడానికి టెహ్రాన్ నాయకత్వం అంగీకరించలేదు. దీంతో గల్ఫ్ ప్రాంతంలో యుద్ధం మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తు న్నాయి. సోమవారం అమెరికా–ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ఇంటెలిజెన్స్ చీఫ్ మేజర్ జనరల్ మాజిద్ ఖదేమీ హతమయ్యారు. ఈ విషయాన్ని ఐఆర్‌జీసీ ప్రకటించి నట్లు ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ వెల్లడించింది. సోమవారం ఉదయం జరిగిన ఎయిర్‌స్ట్రైక్స్‌లో ఖదేమీ చనిపోయినట్లు

2 లో

### ప్రపంచంలోనే

## అతిపెద్ద పార్టీగా బిజెపి

- ఆనాటి నేతలు...నేటి మోడీతో మరింత బలోపేతం
- 47వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పవన్



అమరావతి, ఏప్రిల్ 6 : బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ 47వ వసంతంలో అడుగిడుతున్న శుభ తరుణాన ఆ పార్టీ పార్లమెంటరీ పక్ష నేత, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దేశం పట్ల ప్రేమ, దేశ ప్రజల పట్ల అంకితభావం అనే సిద్ధాంతాలే

2 లో

## నవంబర్ నాటికి మూలపేట పోర్టు పూర్తి



- రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టాం
- గత ప్రభుత్వంలో 20శాతం పనులు మాత్రమే చేశారు
- ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయ్యాయి
- పోర్టు పనులను పరిశీలించిన మంత్రులు జనార్దన్, అచ్చన్న

శ్రీకాకుళం,ఏప్రిల్ 6 ఏప్రిల్ 6 : శ్రీకాకుళం జిల్లా వాసుల చిరకాల ఆకాంక్ష మూలపేట పోర్టు అని మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు అన్నారు. రూ. 4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టామని.. 1,524 ఎకరాల్లో 4 బెర్త్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. మూలపేట పోర్టును ఈ నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. మూలపేట పోర్టును మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్దన్ మాట్లాడుతూ.. మూలపేట పోర్టును పరిశీలించామని.. ప్రాజెక్ట్ నిర్మాణంపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. గత ప్రభుత్వంలో 20 శాతం పనులు మాత్రమే చేశారని.. ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయినట్లు మంత్రి తెలిపారు. 20 నెలల్లోనే 49.63 శాతం ప్రాజెక్ట్ పనులు పూర్తి అయినట్లు వెల్లడించారు.

నేటిపత్రిక
PRGI Regd. No : APTEL/26/A0819
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# సంపాదకీయం

## సహజవాయువు కోసం ఉద్యమించాల్సిందే!

పశ్చిమాసియా యుద్ధం వల్ల ఇంధనం, గ్యాస్ సమస్యలు తీవ్రం అవుతున్నాయి. ప్రధానంగా గ్యాస్ సమస్య తీవ్రత పెరుగుతోంది. ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియడం లేదు. ట్రంప్ బెదరింపులు, హుంకరింపులతో సమస్య మరింత జటిలం అవుతోంది. ఇరాన్ కూడా తగ్గేది లేదన్నట్లుగా పోరాడుతోంది. అమెరికా యుద్ధ విమానాలను కూల్చేస్తోంది. 48 గంటల గడువు ముగిసిన వేళ, నియంత ట్రంప్ ఏ దుర్మార్గాలకు ఒడిగడతాడో తెలియడం లేదు. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో రాష్ట్రం తీవ్ర గ్యాస్ కొరతను ఎదుర్కొంటోంది. సాధారణ ప్రజలు, చిరు వ్యాపారులు హోటల్ నిర్వాహకులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని తినుబండారాల ధరలు పెరుగుతున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచుతుందన్న ప్రచారం కూడా సాగుతోంది. అదే జరిగితే నిత్యావసరాల ధరలు మిన్నంటే ప్రమాదం వుంది. మరోవైపు సహజవాయువు కేటాయింపులు లేక రాష్ట్రంలో గ్యాస్ ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాలు మూతబడిన దుస్థితి ఏర్పడింది. ఫలితంగా అధిక రేటుకు డిస్కంలు విద్యుత్ కొనాల్సివస్తోంది. ఈ క్రమంలో దేశీయంగా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పటికే గ్యాస్ కొరతతో ప్రజలు అగచాట్లు పడుతున్నారు. హోటల్ పరిశ్రమ కుదేలవుతోంది. కట్టెల పొయ్యి లతో కొన్నిచోట్ల నెట్టుకు వస్తున్నారు. విద్యుత్ స్టవ్‌ల ఉత్పత్తి పెరిగింది. అయితే తగినంత విద్యుత్ సరఫరా కూడా కష్టంగానే ఉంది. ఎండాకాలం కావడంతో అడపాదడపా కరెంట్ కష్టాలు మొదలు అయ్యాయి. ఈ క్రమంలో కృష్ణా–గోదావరి బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే చమురు, సహజ వాయువు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇక్కడి సహజవాయువును గృహ, హోటల్ అవసరాలకు మళ్లించాలి. అప్పుడు డిమాండ్‌లో కనీసం 50శాతం అయినా అధిగమించగలం. ఒక రకంగా చెప్పాలంటే ఇది ఉభయ తెలుగు రాష్ట్రాల హక్కు. ఇక్కడి వనరులు వీరికే దక్కాలి. ఈ సహజవాయువులో కనీసం సగం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలని సిపిఎం అధ్వర్యంలో వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాలు, సంస్థలకు చెందినవారు డిమాండ్ చేస్తున్నారు. వీరి డిమాండ్ కూడా న్యాయంగా ఉన్నదే. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇదే డిమాండ్‌తో జనవిజ్ఞాన వేదికవంటి వివిధ సంస్థలు అనేక రూపాల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాయి. అయితే ఆ తరువాత ఉమ్మడి రాష్ట్ర విభజన కోరుతూ ఆందోళనలు, ఇతరేతర కారణాలతో అది వెనక్కు వెళ్లింది. ఈ గ్యాస్ వల్ల ఎపి ఆర్థిక వ్యస్థ కూడా బలపడుతుంది. ప్రజల సమస్యలు తీరుతాయి. దీనిపై చంద్రబాబు పట్టుబట్టాల్సిన తరుణం ఇది. అయితే కార్పోరేట్ దిగ్గజాల చేతిలో ఉన్న ఈ వ్యవహారం విషయంలో చంద్రబాబు అంత తొందరగా నోరువిప్పుతారని అనుకోరాదు. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కూడ రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి పెట్టాలి. ఇక్కడ లభించే గ్యాస్ ఇక్కడి ప్రజలకు సరఫరా చేస్తే... రాష్ట్ర ప్రజలకు ఎంతగానో ఉపయోగపడగలదు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కూడా ఆదాయం సమకూరుతుంది. ఈ విషయంలో స్థానిక ప్రజలే ఉద్యమాలు చేపట్టాల్సి ఉంది. బ్లో అవుట్‌లతో బాధలు పడుతున్న ప్రజలు, గ్యాస్ వల్ల లాభాలు కూడా పొందాలి. మన గ్యాస్ మనకే అని ఉద్యమించాలి. ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన కృష్ణా–గోదావరి డి6 బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును రోజుకు 21 వేల టన్నులు ఉత్పత్తి అవుతోందని అంచనా. రిలయన్స్ కంపెనీ పైపులైన్లు ద్వారా ఇక్కడ నుండి మహారాష్ట్ర, గుజరాత్‌కు గ్యాస్ సరఫరా చేసుకుని అక్కడ పరిశ్రమలు, ఇతర అవసరాలకు విక్రయించి వేల కోట్ల రూపాయల లాభాలు సంపాదిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో వంట గ్యాస్ వినియోగం రోజుకు నాలుగు వేల టన్నులు. ఆయిల్ డ్రిల్లింగ్, ఇతర కార్యకలాపాలతో నిత్య కాలుష్యమేగాక బ్లో అవుట్‌లు, ఇతర ప్రమాదాల్లో రాష్ట్రం విలువైన ప్రాణాలను కోల్పోతున్నది. అత్యంత విలువైన సహజ వనరులను రాష్ట్రం కోల్పోతోంది. కనుక నష్టాలు రాష్ట్రానికి, లాభాలు రిలయన్స్‌కు చెందడం సరికాదు. ఇక్కడి సహజవాయువును కనీసం 50శాతం ఇక్కడి ప్రాంత ప్రజలకు కేటాయించిన తరవాతనే మిగతాది తరలించడం న్యాయం. మన తీరంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్ రాష్ట్రానికి కేటాయిస్తే కరెంటు కష్టాలు కూడా తగ్గుతాయి. కాబట్టి రాష్ట్రంలో లభించే ప్రకృతి వనరులను సరిగా వినియోగించు కుంటే ఇలాంటి ఇబ్బందులు రావు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌లో మన వాటా మనకు వస్తే రూ.950 ఉన్న సిలిండర్ ధర రూ.300– 350కు, యూనిట్ కరెంటు రూపాయికి వచ్చే అవకాశం ఏర్పడుతుంది. పిఎన్‌జి ఇంకా తక్కువ ధరకే లభిస్తుంది. చమురు, సహజ వాయువు జాతీయ సంపద కనుక రాష్ట్రానికి ఇవ్వాల్సిన న్యాయమైన వాటా ఇచ్చి మిగిలినది ఇతర రాష్ట్రాలకు తీసుకెళితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. మన సహజ వనరులను రిలయన్స్‌కు అప్పగించి, మనం ఇబ్బంది పడటం అన్యాయం. కెజి బేసిన్‌లో చట్టబద్ధంగా రావాల్సిన చమురు, సహజవాయువు వాటాను పొందేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలి. అవసరమైతే అసెంబ్లీ తీర్మానించాలి. ఈ విషయంలో అఖిలపక్షంలో చర్చించాలి. గతంలోకి వెళితే కృష్ణా–గోదావరి డి6 బేసిన్ ను రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు 20 ఏళ్ల క్రితం అప్పుడున్న ప్రభుత్వాలు చట్టవిరుద్ధం గా కేటాయించాయి. భూగర్భ నిక్షేపాలను కనుగొన్నపుడు లభించే ఉత్పత్తుల్లో ఆయా కంపెనీలు కేంద్ర ప్రభుత్వానికి వాటాగా సరఫరా చేసే చమురు, సహజవాయువులో 50 శాతాన్ని సంబంధిత రాష్ట్రాలకు కేటాయించాలని 12వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది.

## తమిళనాడులో తండ్రీ కొడుకుల లాకప్‌డెత్ కేసు

దానికంటే ఎక్కువ సేపు మొబైల్ షాప్ తెరిచి ఉంచినందుకు స్థానిక వ్యాపారి జయరాజ్, అతడి కుమారుడు బెనిక్స్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వారిద్దరినీ సత్తాన్‌కులం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి.. ఆ తర్వాత జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. జూన్ 23న కొన్ని గంటల వ్యవధిలో ఇద్దరూ మరణించారు. పోలీసులు రాత్రంతా వారిని తీవ్రంగా కొట్టి హింసించడం వల్లే వారు చనిపోయారని కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో ఆ సమయంలో డ్యూటీలో పోలీసులను సీబీఐ అధికారులు అరెస్టు చేసి, దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో తండ్రీ కుమారులపై పోలీసులు మోపిన అభియోగాలు కూడా అబద్ధమని తేలింది. ఈ కేసులో ఒక మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన వాంగ్మూలం కీలకంగా మారింది. తండ్రీకొడుకులపై రాత్రంతా దాడి జరిగిందని.. స్టేషన్‌లోని బల్లలు, లాఠీలపై రక్తపు మరకలు ఉన్నాయని ఆమె వెల్లడించింది. ఈ విషయం బయటకు రాకుండా ఉండేందుకు సీసీటీవీ రికార్డింగ్‌లు ప్రతిరోజూ ఆటోమేటిక్‌గా డిలీట్ అయ్యేలా పోలీసులు సెట్ చేసినట్లు అధికారులు గుర్తించారు. పోలీసులు పెట్టిన హింస వల్లే తండ్రీకుమారులు మరణించినట్లు ధ్రువీకరించారు. నాటి నుంచి ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది.

## ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మాజిద్ ఖదేమీ హతం

ఐఆర్‌జీసీ ప్రకటించినట్లు తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ ఓ ప్రకటన జారీ చేసింది. అయితే ఈ దాడుల విషయమై ఇజ్రాయెల్ వెంటనే స్పందించలేదు. "ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఇంటెలిజెన్స్ ఆర్గనైజేషన్ అధిపతి.. విద్యావంతుడు, శక్తివంతుడైన మేజర్ జనరల్ మాజిద్ ఖదేమీ.. నేడు (సోమవారం) తెల్లవారుజామున అమెరికన్–జియోనిస్టు శత్రువుల నేరపూరిత ఉగ్రదాడిలో వీరమరణం పొందారు" అని అని ఐఆర్‌జీసీ తమ టెలిగ్రామ్ ఛానెల్‌లో పోస్టు చేసింది. ఐఆర్‌జీసీ చీఫ్ నేరుగా ఇరాన్ సుప్రీం లీడర్‌కు రిపోర్టు చేస్తారు. సుమారు 50 ఏళ్లపాటు సేవలు అందిచిన ఖదేమీ.. గూఢచర్యం, సెక్యూరిటీ సర్వీసుల్లో కీలక పాత్ర పోషించారు. ఖదేమీ మరణం ఐఆర్‌జీసీ వ్యూహాలను తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. గత నెలలో ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ లారిజానీ సైతం ఇజ్రాయెల్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరిట ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన ఇజ్రాయెల్, అమెరికా.. ఆ దేశ సుప్రీం నేత ఖమేనీతోపాటు పెద్ద సంఖ్యలో అత్యున్నత అధికారులను హతమార్చాయి. ఐఆర్‌జీసీ చీఫ్ మహ్మద్ పక్‌పౌర్, బసిజ్ ఫోర్స్ చీఫ్ ఘోలంరెజా సోలెమనీ, రక్షణ మంత్రి అజిజ్ నసిర్‌జాదేహ్ తదితరులు అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీని సైతం హతమారుస్తామని ఇజ్రాయెల్, అమెరికా సైన్యాలు ప్రకటించాయి. సోమవారం ఉదయం ఇరాన్‌లోని ఎస్లాంషార్ ప్రాంతంలో జరిగిన వైమానిక దాడుల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఎస్లాంషార్ పట్టణం రాజధాని టెహ్రాన్‌కు నైరుతి దిశలో ఉంటుంది. సోమవారం ఉదయం ఈ పట్టణంలోని నివాస భవనంపై వైమానిక దాడులు జరిగాయి.

## ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి


ఆలంబనగా బీజేపీ ముందుకు వెళ్తోందన్నారు. మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ లాంటి మహనీయుల సంకల్పం.. ప్రధాని మోదీ అచంచల విశ్వాసంతో కూడిన పోరాటంతో నేడు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ కీర్తిని ఆర్జించిందని వెల్లడించారు. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం క్లిష్ట పరిస్థితుల్లో కూడా సమర్ధవంతమైన విధానాలు అమలు చేస్తూ దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిందన్నారు. భారతీయ జనతా పార్టీ వికసిత్ సంకల్పం దేశాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

## నీటిని దాచుకోవడం నేర్చుకోవాలి

మీటర్ల మేర భూగర్భ జలాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో గతంలో 13 మీటర్ల మేర ఉంటే.. ప్రస్తుతం అవి 11 మీటర్లే ఉన్నాయని తెలిపారు. వర్షాకాలం కంటే ముందు 6 మీటర్ల లోతు, ఆ తర్వాత 3 మీటర్ల కంటే తక్కువగా నీరు చూడాల్సి ఉందని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. అలా చేయగలిగితే రాష్ట్రంలో నీటి ఎద్దడి అనేది ఉండదన్నారు. రాయలసీమలోనూ ప్రతీ ఎకరాకు నీరు ఇచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క ఖరీఫ్‌కు 547 టీఎంసీలు, రబీకి 343 టీఎంసీలు నీరు అవసరమవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. పరిశ్రమలకు 28, తాగు నీటికి 158 టీఎంసీల చొప్పున మొత్తంగా 1,300 టీఎంసీల వరకూ మనకు అవసరం అవుతాయని వివరించారు. ఈ ఏడాదిలో 74 టీఎంసీల నీరు అనంతపురం వరకూ తీసుకు వచ్చామని ఆయన గుర్తు చేశారు. గత పాలకులు మనకు అడ్రస్ లేకుండా చేశారంటూ వైసీపీపై సీఎం చంద్రబాబు నిప్పులు చెరిగారు. ఇప్పుడు మీ రాజధాని ఏదంటే అమరావతి అని గర్వంగా చెప్పే రోజు వచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గతంలో రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడారని.. ఇక మనకు ఒక్కటే రాజధాని నగరం అని పేర్కొన్నారు. మావిగన్ అంటూ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని వైకాపాపై సీఎం చంద్రబాబు విరుచుకుపడ్డారు. వారికి మావిగన్ పిచ్చి ముదిరిందని మండిపడ్డారు. రాష్ట్రంపై పగబట్టారు.. ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అమరావతి దేవతల రాజధాని.. పేరు పలికితే పుణ్యం వస్తుంది. అమరావతి పేరు పలకడం ఇష్టం లేకపోతే ఇంట్లోనే ఉండండి. రాష్ట్రానికి ఒకే రాజధాని.. అది అమరావతి అని సీఎం స్పష్టం చేశారు. పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే అందులో వైసీపీ మినహా 49 పార్టీలు రాజధాని అమరావతికి మద్దతు పలికాయని సీఎం చంద్రబాబు వివరించారు. ఒక్క దిక్కు మాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిచ్చి ముదిరి మావిగన్ అనే పేరు తెరపైకి తెచ్చారని వైసీపీ అధినేతపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. రాజధాని అమరావతి అని పలకడానికి కూడా ఇష్టం లేని వ్యక్తులు మావిగన్ అంటున్నారని సీఎం చంద్రబాబు వ్యంగ్యంగా అన్నారు. బాబాయిని చంపి తన చేతిలో కత్తి పెట్టిన వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారంటూ వైసీపీ నేతల వైఖరిని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎండగట్టారు. రాజధాని అమరావతి పనులు వేగంగా జరుగుతుంటే.. అవి చూసి సహించలేకే ఈ విమర్శలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తుంటే ఓర్వలేకపోతున్నారని వైసీపీ నేతల తీరుపై ఏపీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. దేవాలయాలపై దాడులు చేసి తిరిగి ప్రభుత్వంపై ఎదురుదాడి చేస్తున్నారంటూ వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు. తిరుమలలో శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో ఘోర అపచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జలధారతో ప్రతి ఎకరానికీ జలహారతి ఇచ్చేలా కార్యాచరణ చేపడదామని ప్రజలకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ఒంటిమిట్టలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

దళం వంటి పుష్పాలు, పత్రాలతో స్వామి, అమ్మవారికి పుష్పనీరాజనం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి సుమారు 3 టన్నుల పుష్పాలు విరాళంగా అందాయి. ప్రకృతి వైపరీత్యాలు తొలగి భక్తులు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థిస్తూ, భూమాతను ప్రసన్నం చేసుకునేందుకు పుష్పయాగం నిర్వహిస్తారు. అలాగే నిత్యకైంకర్యాలలో తెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా ఈ యాగాన్ని చేస్తారని అర్చకులు తెలిపారు. ఈ యాగం ద్వారా దోషాలు తొలగి శుభఫలితాలు కలుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు సదాశివ రావు, డిప్యూటీ ఈవో ప్రశాంతి, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## దళితులు రిజిస్టర్ భూములను కబ్జా చేసి ముళ్ళ తంతి తీసిన వారి పైన వెంటనే చర్యలు తీసుకోవాలి

### భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

పుల్లంపేట ప్రజా సీమ న్యూస్:తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం దేవ సముద్రం ఎస్సీ కాలనీ గ్రామ కంఠం ను వాళ్ల రిజిస్ట్రేషన్ భూములను కబ్జాదారులు కబ్జా చేసి పెన్షన్ తీసినందుకు తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం తెలియజేసి పుల్లంపేట మండల తహసిల్దార్ పుల్లారెడ్డి గారికి వినతపత్రం అందజేయడం జరిగినది ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య. వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఎం జయరామయ్య మాట్లాడుతూ దేవ సముద్రం హరిజనవాడ వాసులు గుడిసె నాగుడు. గుడిసె సుబ్బడు వీళ్ళ ముత్తాతల కాలం నుండి దేవ సముద్రం రెవిన్యూ సర్వే నెంబర్ 334/1ౘా లో విస్తీర్ణం 5 ఎకరాల12 సెంట్లు ముత్తాతల పేర్లతో రిజిస్ట్రేషన్ ఉన్న భూమిని వాళ్ల ఆర్థిక పరిస్థితి సరిగా లేక సదరు భూమిలో 30 సెంట్లు అగ్రవర్ణ కులానికి చెందిన వారికి అమ్ముకోవడం జరిగింది ఆ 30 సెట్లు స్థలన్ని ను అడ్డు పెట్టుకొని మొత్తం 5 ఎకరాల 12 సెంట్లు దొంగ రిజిస్ట్రేషన్ చేసుకుని దొంగ డాక్యుమెంట్స్ సృష్టించి మొత్తం భూమి మాదేనని సదరు భూమి కోర్టులో ఉన్న కూడా కోర్టు తీర్పును ఉల్లంఘించి లెక్కచేయకుండా పుల్లంపేట పోలీస్ యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని దళితులు 18 మంది పైన కేసులు పెట్టి భయ ప్రాంతానికి గురిచేసి అగ్రవర్ణాల వారికి సదురు భూమిని పోలీస్ యంత్రాంగం దగ్గర ఉండి పెన్షన్ తీయడం అనేది దుర్మార్గమని అన్నారు న్యాయం పక్షాన నిలబడాల్సినటువంటి పోలీస్ యంత్రాంగం అవినీతి పక్షాన నిలబడి దళితులను భయ ప్రాంతానికి గురిచేసి సదురు భూమి చుట్టూ ఫెన్సింగ్ తీయించడం జరిగింది అన్నారు. ఎన్నో తరాల నుండి ముత్తాతల కాలం నుండి దళితులకు ఉన్న రిజిస్ట్రేషన్ భూములను కూడా దళితుల నుండి లాక్కోవాలని ప్రయత్నిస్తున్నటు వంటి భూ బకాసురుల పైన వెంటనే పల్లంపేట మండల తాసిల్దార్ గారు చర్య తీసుకొని సదరు భూముల్లో ఉన్న పెన్షన్ను తొలగించి దళితుల భూములను దళితులకు ఇవ్వాలని లేని పక్షంలో 13.04.2026 తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు తాసిల్దార్ కార్యాలయాన్ని బాధితులను కలుపుకొని ముట్టడింపు కార్యక్రమం చేపడతామని తెలియజేసుకుంటున్నాము ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పుల్లంపేట మండల కార్యదర్శి రాజబోయన సెల్వన్ కుమార్. రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు చింతలపూరి నాగమ్మ. డిహెచ్ఎస్ ఓబులవారిపల్లి మండల కార్యదర్శి ఎం వెంకటరమణ. రైతు సంఘం నాయకులు శివరామరాజు. దైవసముద్రం హరిజనవాడ గ్రామ బాధితులు పాల్గొనడం జరిగినది.


## విద్యార్థులకు ప్లేట్లు, పెన్నులు పంపిణీ



పుల్లంపేట ప్రజాసీమ న్యూస్: తిరుపతి జిల్లా పుల్లంపేట మండల పరిధిలోని అనంతంపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన కీర్తిశేషులు కావేటి రాములమ్మ జ్ఞాపకార్థంగా ఆమె కుమారుడు కావేటి వెంకటరమణ దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు అన్నం తినే ప్లేట్లు, పెన్నులు, పెన్సిల్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ తన తల్లి జ్ఞాపకార్థంగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తమ కుటుంబం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుశర్మ, చేజర్ల పాండురంగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం జరగాలి

**- ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు - జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఆదేశం**





మదనపల్లె (ప్రజా సీమ) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల పోలీసు అధికారులు అత్యంత బాధ్యతతో,సత్వరమే స్పందించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ స్పష్టం చేశారు.సోమవారం మదనపల్లెలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధిత ప్రజలు తమ గోడును ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు.ప్రధానంగా కుటుంబ కలహాలు,ఆస్తి,భూ వివాదాలు,నకిలీ పత్రాల సృష్టి,అధిక వడ్డీల వేధింపులతో పాటు సైబర్ నేరాలు,ఆన్‌లైన్ మోసాలు,ప్రేమ పేరుతో జరిగిన వంచన తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి.ప్రతీ ఒక్కరి సమస్యను విన్న ఎస్పీ,ఆయా కేసుల పూర్వాపరాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు.అక్కడి నుంచే సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి,ఫిర్యాదులపై తక్షణమే విచారణ చేపట్టి చట్టపరిధిలో బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని ఆదేశించారు.చట్టపరమైన చర్యలు తీసుకున్న వెంటనే పూర్తి వివరాలతో కూడిన నివేదికలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని కింది స్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.


**మానవత్వం చాటుకున్న ఎస్పీ**

నడవలేని స్థితిలో తమ బాధలు చెప్పుకునేందుకు వచ్చిన వృద్ధుల పట్ల ఎస్పీ ప్రత్యేక సానుభూతిని కనబరిచారు.వారు తనవద్దకు వచ్చే వరకు వేచి చూడకుండా,వృద్ధులవద్దకే స్వయంగా వెళ్లి వారి ఫిర్యాదులను స్వీకరించి భరోసా కల్పించారు.కలికిరి మండలం కె.కొత్తపల్లికి చెందిన తుమ్మలపల్లి మల్లమ్మ అనే వృద్ధురాలి సమస్యను సావధానంగా విని,చట్ట పరిధిలో వెంటనే పరిష్కారం చూపాలని కలికిరి సీఐని ఆదేశించారు.అలాగే,మదనపల్లెలోని ఈశ్వరమ్మ కాలనీకి చెందిన షేక్ గౌస్ సాహెబ్ ఎస్పీకి తమ సమస్యను విన్నవించుకోగా,దానిని సత్వరమే చట్టపరిధిలో పరిష్కరించాలని మదనపల్లె తాలూకా సీఐకి ఆదేశాలు జారీ చేశారు.బాధితుల పక్షాన నిలబడి వారికి అండగా ఉండటమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని ఈ సందర్భంగా ఎస్పీ గుర్తుచేశారు.

# విద్యుత్ వైర్లు తగిలి ఆర్టీసీ బస్సు దగ్ధం

**- డ్రైవర్ అప్రమత్తతో తృటిలో తప్పిన పెను ప్రమాదం**

**- 18 మంది ప్రయాణికులు క్షేమం**



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ: మండలంలోని వీరన్నగట్టుపల్లి క్రాస్ వద్ద విద్యుత్ వైర్లు ఆర్టీసీ బస్సుకు తగలడంతో ఆ బస్సు దగ్ధమైంది. ఆదివారం కడప డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేంపల్లె నుంచి కదిరికీ వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. విద్యుత్ వైర్లు బస్సు టాప్ పై తగలడంతో మంటలు చెలరేగాయి. బస్సులో ప్రయాణిస్తున్న 18 మంది ప్రయాణికులు కేకలు వేయడంతో డ్రైవర్ అప్రమత్తతో బస్సును నిలిపివేశాడు. దీంతో ప్రయాణికులు బస్సులోంచి కిందకి దిగారు. క్రమేపి మంటలు వ్యాపించడంతో ఆ బస్సు పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక అధికారులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. తృటిలో పెను ప్రమాదం తప్పడంతో బస్సులోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు, అగ్నిమాపక అధికారులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. ఆర్టీసీ డ్రైవర్ వలి.. రోడ్డు పనులు జరుగుతున్న నైపథ్యంలో సర్వీస్ రోడ్ లో వెళుతుండగా విద్యుత్ వైర్లు తగిలాయి. దీంతో అప్రమత్తమై బస్సును ముందుకు ఆపడం జరిగింది. ఆర్కేవ్యాలీ సీఐ శంకర్ రెడ్డి.. రోడ్డు కాంట్రాక్ట్ పనులు చేసే వారి నిర్లక్ష్య కారణంతో ఆర్టీసీ బస్సుకీ విద్యుత్ వైర్లు తగిలాయి. రోడ్డు పనుల నిమిత్తం ఎటువంటి సూచికలు లేకపోవడం వల్ల ప్రమాదం జరిగింది. బస్సుకు విద్యుత్ వైర్లు తగలగానే విద్యుత్ లైన్ ట్రిప్ అవడంతో పెను ప్రమాదం తప్పింది. మున్ముందు ఇలాంటి ప్రమాదాలు జరగకుండా రోడ్డు భవనాల శాఖ అధికారులు, విద్యుత్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటాము.

# పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలి

**- అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ ఆదేశం**



మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లి కలెక్టరేట్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ హాలులో సోమ వారం అన్నమయ్య జిల్లా మదనపల్లి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం,పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అర్జీలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తోపాటు మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఎస్.డి.సి చంద్రశేఖర్ రెడ్డి,ఆర్డీవో శ్రీనివాసులు,సర్వే శాఖ ఏడి భరత్ కుమార్ తదితరులు అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక,రెవెన్యూ క్లినిక్ ల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు.అర్జీలను వేగవంతంగా,నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలని, గ్రీవెన్స్ పై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.అర్జీలను గడువులోపు అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

**ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు**

చౌడేపల్లి మండలం కాగతి పంచాయతీ మరి మాకులపల్లికి చెందిన ఎస్.కౌసల్య యాక్సిడెంట్ వల్ల తన భర్త నడవలేని స్థితిలో మంచానికి పరిమితం అయ్యారని,ప్రభుత్వం ద్వారా పింఛను మంజూరు చేయాలని దరఖాస్తును సమర్పించారు.మదనపల్లి పట్టణానికి చెందిన కే.గాయత్రి తాము కూలి పని చేసుకుని బ్రతుకుతున్నామని,తన రెండవ కుమారుడు శరీర అవయవాలు,కాళ్లు చేతులు సరిగా పనిచేయకపోవడం వల్ల ఆర్థిక పరిస్థితికి మించి వైద్య చికిత్స చేయిస్తున్నామని,తన కుమారునికి వైద్య చికిత్సలు ఉచితంగా అందజేయుటకు చర్యలు తీసుకోవాలని అర్జీ సమర్పించారు.మదనపల్లి మండలం ఎగువ కురవ వంకకు చెందిన కే.అనూషా రేషన్ కార్డులో తన పేరును తొలగించబడిందని,విచారణ చేసి తిరిగి తన పేరు రేషన్ కార్డులో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని అర్జీ సమర్పించారు.ఈ కార్యక్రమంలో వివిధ రకాల సమస్యలపై మొత్తంగా 388 అర్జీలను దరఖాస్తుదారులు సమర్పించారు.ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా,మండల స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

**ఎక్సైజ్ సీఐ రాజశేఖర్**



సిద్ధవటం ( ప్రజా సీమ) : ఎక్సైజ్ పరిధిలోని సిద్ధవటం, అట్లూరు, ఒంటిమిట్ట మండలాల్లో బెల్ట్ షాపులు, మాదక ద్రవ్యాలు విక్రయిస్తే కఠినమైన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ హెచ్చరించారు ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రమైన సిద్ధవటం లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లో మాట్లాడుతూ అట్లూరు, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాల్లో గంజాయి ఇతర మాదక ద్రవ్యాలు బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు, రాత్రి వేళల్లో కొన్ని గ్రామాలలో మాదక ద్రవ్యాల పై అవగాహన నిర్వహించామని మాదక ద్రవ్యాలు, బెల్ట్ షాపులు నిర్వహించిన 118 మంది వ్యక్తులు పైన కేసులు నమోదు చేశామని తెలిపారు బెల్ట్ షాపులు, గంజాయి విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు

# అత్యంత ఘనంగా సంజయ్ వినాయక్ జోషి పుట్టినరోజు వేడుకలు

**- శుభాకాంక్షలు తెలిపిన వేంపల్లి అష్రఫ్,ఇతర ప్రముఖులు**



మదనపల్లె (ప్రజా సీమ) : అఖిల భారతీయ గోరక్ష మహాసంఘ్ అంతర్జాతీయ అధ్యక్షులు,భారతీయ జనతా పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సంజయ్ వినాయక్ జోషి పుట్టినరోజు వేడుకలు సోమవారం న్యూఢిల్లీలో పండుగ వాతావరణంలో జరిగాయి.ఈ వేడుకలకు మహాసంఘ్ ఏపీ అధ్యక్షుడు వేంపల్లి అష్రఫ్,మహాసంఘ్ జాతీయ అధ్యక్షులు కలీం భారతి,జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అయూబ్ ఖాన్,ఉత్తరప్రదేశ్ మైనార్టీ సెక్రటరీ మహమ్మద్ అనాన్ తదితరులు హాజరై ఆయనను శాలువాలతో సన్మానించి,పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వేంపల్లి అష్రఫ్ మాట్లాడుతూ బిజెపి ఆవిర్భావ దినోత్సవం,భాజపా మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి అయినటువంటి సంజయ్ వినాయక్ జోషి జన్మదిన వేడుకలు ఒకేరోజు జరుపుకోవడం శుభప్రదమన్నారు.దేశ రాజకీయాలలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న సంజయ్ వినాయక్ జోషి నిస్వార్థ రాజకీయ నాయకులలో ఒకరని కొనియాడారు.అదేవిధంగా గోరక్ష మహాసంఘ్ కార్యకలాపాలను అంతర్జాతీయ స్థాయిలో చేపట్టి అందరి ప్రశంసలు అందుకుంటున్నారన్నారు.భారతదేశంలో పూర్తిస్థాయిలో గోవుల సంరక్షణకు ఆయన విధివిధానాలను రూపొందిస్తున్నారన్నారు.భారతీయ జనతా పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ దేశ అభివృద్ధికి బాటలు వేస్తున్నారని ప్రశంసించారు.సమాజ హితమే తన హితంగా భావించే సంజయ్ వినాయక్ జోషి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,భవిష్యత్తులో ఉన్నత పదవులు అలంకరించాలని ఆ భగవంతున్ని కోరుకున్నట్లు ఆయన వెల్లడించారు.

# రైల్వే కోడూరులో సిఐటియు వ్యవస్థాపకులు, బి టి రణదీవే కి ఘన నివాళి




రైల్వేకోడూరు ( ప్రజాసేన) : సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు బీటీ రణదీవే కి, తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో సిఐటియు ఆఫీసులో సోమవారం 36వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సిఐటియు నేతలు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా, అన్నమయ్య సిఐటియు జిల్లా అధ్యక్షులు, సిహెచ్ చంద్రశేఖర్, మాట్లాడుతూ, 1904, డిసెంబర్ 19న బొంబాయిలో జన్మించారన్నారు, బ్రిటిష్ సామ్రాజ్యవాదం కు వ్యతిరేకంగా పోరాడన్నారు. 1928 లోనే, కార్మిక హక్కుల కోసం పోరాడారన్నారు,సంఘాలు నిర్మించి, కార్మిక నాయకుడిగా, జూట్ మిల్లులు, రైల్వే సమ్మె, నౌకాదళ నేవీ తిరుగుబాటుకు మద్దతుగా సమ్మె చేశారన్నారు, సంఘటన కార్మికులతో పాటు, అసంఘటితరంగాల కార్మికులను ఐక్యపరిచారన్నారు. కమ్యూనిస్టు పార్టీకి రెండు సంవత్సరాల పాటు జాతీయ కార్యదర్శిగాను పని చేశారన్నారు. స్వాతంత్ర్య అనంతరం, సోషలిస్టు లక్ష్యం కోసం, ఐక్యత ,పోరాటం నినాదంతో, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ సిఐటియు 1970, మే 30 తేదీన కలకత్తాలో మహాసభల్లో ఏర్పడిన వ్యవస్థాపక అధ్యక్షులుగా బి టి ఆర్ ఎన్నికయ్యారు అన్నారు. దేశంలో అతి పెద్ద కార్మిక సంఘంగా అభివృద్ధి కావడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఎమర్జెన్సీలో అరెస్టై జైలు జీవితం గడిపారన్నారు. 1964 లోసిపిఎం పార్టీ ఏర్పడినప్పుడు కీలక పాత్ర పోషించారు అన్నారు. పుచ్చలపల్లి.సుందరయ్య. జ్యోతి బస్సు , హరికృష్ణ సింగ్ సుర్జిత్, తో కలిసి పని చేశారన్నారు. 1990 డిసెంబర్ 6న అమరులయ్యారున్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, పోరాడటం, పోరాడి సాధించిన,కార్మిక హక్కుల కోసం పోరాడటం, సోషలిస్ట్ లక్ష్యం కోసం పనిచేయడమే. ఆయనకు మనం ఇచ్చేది నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో, సిఐటియు జిల్లా నాయకులు, ఏపీ ఎం డిసి జేఏసీ పోరాట కన్వీనర్, ఆర్ వెంకటేష్, సిఐటియు మండల కార్యదర్శి పి జాన్ ప్రసాద్, ఉపాధ్యక్షులు, లింగాల యానాదయ్య, సహాయ కార్యదర్శి, నగిరిపాటి ఆనంద్, ఓబులవారిపల్లి సిఐటియు మండల కన్వీనర్, నాగిపోగు పెంచలయ్య, డివైఎఫ్ఐ నాయకులు, ఏదోటి. ప్రేమ్ చందు, తదితరులు పాల్గొన్నారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# ఐటీ రంగంలో జావా డెవలపర్లకు అత్యంత ప్రాధాన్యత

## - మిట్స్ యూనివర్శిటీలో స్కిల్ డెవలప్‌మెంట్
## - హాజరైన బైట్స్ ఇండియా టెక్నికల్ ట్రైనర్ శశాంక్ విద్వాన్




కురబలకోట (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్) విభాగం మరియు మిట్స్ ఐ.ఐ.సి వారి ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం జావా ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శశాంక్ విద్వాన్,సీనియర్ టెక్నికల్ ట్రైనర్,బైట్స్ ఇండియా కంపెనీ,కోయిం బత్తూర్,తమిళనాడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఐటీ రంగంలో జావా డెవలపర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉందని,సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్,ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్,క్లౌడ్ కంప్యూటింగ్ వంటి రంగాల్లో కెరీర్ అవకాశాలను విస్తరించడానికి జావా ఒక బలమైన పునాదిఅన్నారు. సాఫ్ట్‌వేర్ నిపుణులుగా ఎదగాలను కునే విద్యార్థులకు జావా ప్రోగ్రామింగ్ చాలా ముఖ్యమన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సాఫ్ట్‌వేర్ అభివృద్ధి,వెబ్ మరియు మొబైల్ అప్లికేషన్లు,ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్లలో జావా విస్తృతంగా ఉపయోగించబడుతున్న నేపథ్యంలో ఈ భాషలో ప్రావీణ్యం సాధించడం అత్యంత అవసరమని తెలిపారు. ఇందులో భాగంగా ఆబ్జెక్ట్ ఓరియెంటెడ్ ప్రోగ్రామింగ్ కాన్సెప్ట్‌లు,డేటా స్ట్రక్చర్స్,అల్గోరిథమ్స్‌పై ప్రాక్టికల్ శిక్షణ అందించడంతోపాటు స్ప్రింగ్,హైబర్నేట్ వంటి ఆధునిక ఫ్రేమ్‌వర్క్‌లపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రాక్టికల్ ప్రాజెక్టులు,కోడింగ్ వ్యాయామాలు మరియు ఇంటర్న్‌షిప్ అవకాశాల ప్రాధాన్యాన్ని వివరించారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఐటీ రంగంలో ఉన్న విస్తృత అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని,ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఆర్.కల్పనా,కో-ఆర్డినేటర్స్ డాక్టర్ చొక్కనాథన్, ఎమ్.వాసుదేవన్,అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మదనపల్లె తహశీల్దారు కిషోర్ కుమార్ రెడ్డిపై వేటు

## - కలెక్టరుకి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు
## - అవినీతి,అక్రమాలపై చర్యలు తీసుకున్న కలెక్టర్

మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె తహశీల్దారు కిషోర్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ చర్యలు తీసుకున్నారు. తహశీల్దారు అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు బాధితుడు విజిల్ బ్లోయర్,చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సిసిఎల్ఎ)లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మదనపల్లెకు చెందిన వెంకటప్ప కుమారుడు బోయపాటి రవి తన ల్యాండ్ మ్యుటేషన్ నిమిత్తం తహశీల్దారు కిషోర్ కుమార్ రెడ్డిని ఆశ్రయించాడు. సదరు తహశీల్దారు వీఆర్ఓ ప్రవీణ్ ను మధ్యవర్తిగా నియమించుకుని రూ. 10లక్షలు డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దారు తన బినామి అకౌంట్ కు రూ. 5లక్షలు వేయించుకుని ల్యాండ్ మ్యుటేషన్ ప్రొసీడింగ్స్ ఇచ్చాడు. తదనంతరం మూడు రోజుల వ్యవధిలోనే ప్రొసీడింగ్స్ క్యాన్సిల్ చేస్తూ జేసీకి పంపుతున్నామని కొత్త డ్రామాకు తెరతీశాడు. దీంతో బాధితుడు విజిల్ బ్లోయర్,సిసిఎల్ఎను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. మదనపల్లె తహశీల్దారు కిషోర్ కుమార్ రెడ్డి వ్యవస్థీకృత అవినీతికి,లంచాలకు అలవాటుపడి బెదిరింపులకు పాల్పడుతూ అధికార దుర్వినియోగం పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మదనపల్లె తహశీల్దారు కార్యాలయంలో తీవ్రమైన అవినీతి వ్యవస్థ నడుస్తోందని,ప్రస్తుత తహసీల్దార్ కిషోర్ కుమార్ రెడ్డి ప్రభుత్వ కార్యాలయాన్ని అక్రమ ఆదాయం పొందే కేంద్రంగా మార్చారని ఆరోపణలు చేశారు. లంచాలకు అలవాటుపడి రైతులు,సాధారణ ప్రజల నుండి బలవంతంగా డబ్బులు వసూలు చేసే విధానానికి నాంది పలికారని తెలిపారు. ఎలాంటి ఫైల్,దరఖాస్తు,ఫిర్యాదు అయినా లంచం లేకుండా ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు. వీఆర్ఓ ప్రవీణ్ ను




మధ్యవర్తిగా పెట్టుకుని లంచాలు డీల్ చేస్తున్నారని,నేషనల్ హైవే భూమి పరిహారంలో వాటా కూడా కావాలని డిమాండ్ చేశారని తెలిపారు. డబ్బు ఇవ్వకపోతే జీవితాంతం నీ పని పూర్తికాదని ప్రవీణ్ బెదిరించడంతో రైతు బినామి పేరు అక్కలరెడ్డి కుమారి అకౌంట్ నం : 44560954428 రూ.5 లక్షలు పంపాడు. దీంతో అధికార దుర్వినియోగానికి పాల్పడి మార్చి 23న రైతు కయ అనుకూలంగా ఆర్డర్ ఇచ్చి,30వ తేది మాట మార్చి,జాయింట్ కలెక్టర్‌కు పంపుతానన్నాని సమస్యను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేశారని పేర్కొన్నారు. ఇది ఒక్క కేసే కాదని,మదనపల్లె తహశీల్దారు కార్యాలయంలో ఇలా భారీ అవినీతి నెట్‌వర్క్ సాగుతోందన్నారు. రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై తహశీల్దారును కలెక్టరుకి అటాచ్ చేస్తూ కలెక్టర్ చర్యలు తీసుకున్నారు.

# గొప్ప మనసున్న నేత ఎమ్మెల్యే షాజహాన్ బాషా

## - జి.వి.నాయుడు కుమార్తె వివాహానికి రూ.లక్ష సాయం



మదనపల్లె (ప్రజా సీమ) : ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా మరోసారి గొప్ప మనసు చాటుకున్నారు. మదనపల్లి నియోజకవర్గం,పొన్నిటీపాళ్యం పంచాయతీ,పనసమాకులపల్లెకి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గూని వెంకటరమణ నాయుడు (జి.వి.నాయుడు) జ్యేష్ఠ కుమార్తె నాగమల్లిక వివాహం ఈనెల 8,9 తేదీలలో జరగనుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జి.వి నాయుడు కుమార్తె వివాహ ఖర్చులకు గాను సోమవారం రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబం నుండి వచ్చిన జి.వి.నాయుడు తెలుగుదేశం పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించి,సర్వం ధారపోశారన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఆయనపై అక్రమ కేసులు బనాయించి 69 రోజులు జైల్లో పెట్టి వేధించారన్నారు. అయినప్పటికీ మొక్కవోని విశ్వాసంతో వైసిపి అరాచకాలపై పోరాడి పార్టీకి వీర విధేయుడిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ బాబు సైతం జీవి నాయుడుని మెచ్చుకున్నారని గుర్తు చేశారు. అదేవిధంగా టిడిపి శ్రేణులంతా జీవి నాయుడు కుమార్తె వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించాలన్నారు. అనంతరం జీవి నాయుడు మాట్లాడుతూ టిడిపి మరియు ప్రజా నాయకుడు ఎమ్మెల్యే షాజహాన్ బాషా అంటే తనకు అంతులేని అభిమానమన్నారు. పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి ఎమ్మెల్యే తనకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. విద్యుత్ శాఖలో నా కుమార్తెకు ఉద్యోగం ఇప్పించడంతోపాటు ఆమె వివాహానికి రూ.లక్ష ఇచ్చారని కొనియాడారు. ఆయనకు మా కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుందని స్పష్టం చేశారు. అదేవిధంగా ఈనెల 8,9 తేదీలలో జరిగే నా కుమార్తె వివాహానికి ప్రతి ఒక్కరూ హాజరై మా ఆతిథ్యాన్ని స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

# చియ్యవరం కమ్మపల్లి లో నవమి ఉత్సవాలులో పాల్గొన్న ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు





రైల్వేకోడూరు ( ప్రజాసేన) : వేళ తాళాలతో మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికిన చియ్యవరం కమ్మపల్లి గ్రామ ప్రజలు ఘనంగా ముగిసిన నవమి ఉత్సవాలు తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం రైల్వే కోడూరు మండలంలోని చియ్యవరం కమ్మపల్లి గ్రామం శ్రీరామ నవమి ఉత్సవాలు చివరి రోజు సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ సీతారాములలి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు, పారిశ్రామికవేత మాచినేని విశ్వేశ్వర నాయుడు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు , ఆంధ్రప్రదేశ్ ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల శాఖ కార్పొరేషన్ చైర్మన్ కేకే చౌదరి , ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు పాల్గొనడం జరిగినది. అదేవిధంగా కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం




రైల్వేకోడూరు ( ప్రజాసీమ) : భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రైల్వే కోడూరు నియోజకవర్గం, ఓబుళవారి పల్లి మండలం లోని పెద్ద గ్రామమైన వై ఎర్రగుంటకోట గ్రామంలో కార్యకర్తల మధ్యన రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, మాజీ నియోజకవర్గం ఇంచార్జి గడ్డం చెంగల్ రాజు చేతుల మీదుగా మండల అధ్యక్షులు ముక్క రూపేష్ రెడ్డి నాయకత్వంలో వై కోట శక్తి కేంద్ర ప్రముఖ బాలాజీ ఆధ్వర్యంలో బిజెపి జెండాను ఆవిష్కరించడం జరిగింది, ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలాజీ, సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ శంకరయ్య, సుబ్బా రాయడు ఆచారి,మండల ప్రధాన కార్యదర్శి కేశవరాజు, చిన్న రెడ్డయ్యా , అక్కిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, లోకేష్ రాజు, నరేష్ రాజు, సురేష్, రామరాజు, హరి, కార్తీక్ గ్రామ పేదలు, బిజెపి కుటుంబ సభ్యులు పాల్గొని విజయ వంతం చేశారు

# మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలు

## - ఏప్రిల్ 30 వరకు ఆంక్షలు - ఏఎస్పీ ఎం.వెంకటాద్రి స్పష్టం



మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు జిల్లా అదనపు ఎస్పీ (మదనపల్లి ఇంచార్జ్ డీఎస్పీ) ఎం.వెంకటాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**ముందస్తు అనుమతి తప్పనిసరి**

పట్టణ మరియు సబ్ డివిజన్ పరిధిలో వివిధ రాజకీయ పార్టీలు,సంఘాలు చేపట్టే ఊరేగింపులు,ధర్నాలు,బహిరంగ సభలు మరియు నిరసన కార్యక్రమాలకు పోలీసుల ముందస్తు అనుమతి ఖచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. అనుమతి కోరుతూ కనీసం 48 గంటల ముందే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులో కార్యక్రమం నిర్వహించే రూట్ మ్యాప్,సమయం,తేదీ,ఆర్గనైజర్ల ఐడీ ప్రూఫ్ మరియు హాజరయ్యే జనసమీకరణ వివరాలను తప్పనిసరిగా పొందుపరచాల్సి ఉంటుంది. ఈ ఆంక్షలు ఏప్రిల్ 1వ తేదీ ఉదయం 6 గంటల నుండి ఏప్రిల్ 30వ తేదీ అర్ధరాత్రి వరకు అమలులో ఉంటాయన్నారు. మదనపల్లి మున్సిపల్ పరిధి,మండలం మరియు సబ్ డివిజన్ వ్యాప్తంగా ఈ ఉత్తర్వులు వర్తిస్తాయన్నారు. వివాహ వేడుకలు మరియు అంత్యక్రియల ఊరేగింపులకు ఈ నిబంధనల నుండి మినహాయింపు ఉంటుందన్నారు. ప్రజా శాంతికి భంగం కలగకుండా,ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రజలు,రాజకీయ పార్టీలు మరియు స్వచ్ఛంద సంస్థలు పోలీసు శాఖకు సహకరించాలని అదనపు ఎస్పీ కోరారు. నిబంధనలు అతిక్రమించి సభలు,సమావేశాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# వెలుగు సంస్థలో వైభవంగా సుకృత్ రాయల్ జన్మదిన వేడుకలు

**- దివ్యాంగులకు మరియు వృద్ధులకు అన్నవితరణ**

**- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన ఉదయ్ మోహన్ రెడ్డి**






మదనపల్లె (ప్రజా సీమ) : అమ్మచెరువుమిట్ట నందు గల వెలుగు సంస్థలో సోమవారం కురవంక మాజీ సర్పంచ్ పసుపులేటి చలపతి,పార్వతమ్మల మనుమడు మరియు శశి కుమార్,లావణ్యల కుమారుడు అయిన సుకృత్ రాయల్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.ముందుగా వెలుగు సంస్థకు విచ్చేసిన పసుపులేటి చలపతి కుటుంబ సభ్యులు దివ్యాంగులను మరియు వృద్దులను ప్రేమతో పలకరించిహౌయోగక్షేమాలు తెలుసుకున్నారు.అనంతరం వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సుకృత్ కేట్ చేయగా అందరూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం దివ్యాంగులకు మరియు వృద్దులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పసుపులేటి చలపతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా మా మనుమడు సుకృత్ జన్మదినం వెలుగు సంస్థలోని దివ్యాంగుల మరియు వృద్దుల మధ్య జరుపుకోవడం మాకు,మా కుటుంబ సభ్యులకు ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. వెలుగు సంస్థ ద్వారా దివ్యాంగులు,వృద్ధుల ఆలనాపాలన చూస్తున్న సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి,కన్వీనర్ భాగ్యలక్ష్మిల సేవలు వెలకట్టలేని కొనియాడారు.భవిష్యత్తులో వెలుగు సంస్థకు తమ వంతు సహాయ,సహకారాలు అందిస్తామని వారు స్పష్టం చేశారు.అంతరం వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవకే కాకుండా సమాజ సేవకు పసుపులేటి చలపతి ఎల్లప్పుడు ముందు ఉంటారని ప్రశంసించారు.వారి కుటుంబంలో జరిగే ప్రతి శుభకార్యాల సందర్భంగా వెలుగు సంస్థలోని దివ్యాంగులు మరియు వృద్దులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం మాకెంతో ఆనందంగా ఉందని కృతజ్ఞతలు తెలియజేశారు.చిన్నారి సుకృత్ రాయల్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,తాత అడుగుజాడల్లో పయనించి అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని,సమాజ సేవకు పునరంకితం కావాలని ఆకాంక్షించారు.అనంతరం సర్పంచ్ చలపతి,వారి కుటుంబ సభ్యులకు సన్మానించి,మెమొంటోలను అందజేశారు.ఈ కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి,కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి,ప్రిన్సిపాల్ లీనా కుమారి,వార్డెన్ స్వీటీ,సోషల్ వర్కర్ గీత,వెలుగు చిన్నారులు,వృద్దులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక పర్యాటక హబ్ గా ఒంటిమిట్ట

**- స్టేట్ టెంపుల్ గా మారిన ఒంటిమిట్ట అభివృద్ధికి శ్రీకారం**

**- రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి చమ్మర్థి**

ఒంటిమిట్ట(ప్రజా సీమ) : ఒంటిమిట్ట సీతారాముల కళ్యాణం 'నా భూతో నా భవిష్యతి'గా నిర్వహించాం– తెలుగుదేశం పార్టీ రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్రాజు లోక కళ్యాణార్థం ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహణ టీటీడీ, జిల్లా యంత్రాంగం సమిష్టి కృషిస్టేట్ టెంపుల్గా మారిన తర్వాత వేగవంతమైన అభివృద్ధి శ్రీరామ ఎత్తిపోతల పథకంతో కరువు నివారణ భక్తుల కోసం అదనపు సౌకర్యాలు -- కాటేజీల నిర్మాణం గ్రీన్ ఫీల్డ్ హైవేతో రవాణా సౌకర్యాల మెరుగుదల ఒంటిమిట్ట చెరువులో భారీ అభివృద్ధి ప్రణాళికలు స్థానిక ఉపాధి కోసం పరిశ్రమల కారిడార్ ఏర్పాట్లు ముఖ్యమంత్రి హెలికాప్టర్ సర్వేప్రత్యేక దృష్టి అయోధ్య తర్వాత అంతటి ప్రాధాన్యం , ఒంటిమిట్టకు గుర్తింపు – బొబ్బిలి రాయుడు ఒంటిమిట్ట అంటే గౌరవం' -- ఎంపీపీ ప్రతినిధిసలాబాద్ బుజ్జి ఒంటిమిట్ట కోదండ రామయ్య కీర్తిని నలదిక్కుల వ్యాప్తి చేద్దాం– మండల ప్రధాన కార్యదర్శి ఆలూరి వెంకటసుబ్బయ్య



**సమిష్టి కృషికి నేతల కృతజ్ఞతలు**

"ఒంటిమిట్ట శ్రీ కోదండరాముల స్వామి వారి సీతారాముల కళ్యాణం 'నా భూతో నా భవిష్యతి' అనే విధంగా అత్యంత వైభవంగా జరిగింది" అని రాజంపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు పేర్కొన్నారు. ఒంటిమిట్టలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**లోక కళ్యాణార్థం అధికారికంగా కళ్యాణం**

లోక కళ్యాణార్థం రాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, టీటీడీ సంయుక్తంగా ఒంటిమిట్టలో సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. లక్షలాది భక్తులు హాజరైనప్పటికీ, టీటీడీ మరియు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సౌకర్యాలు కల్పించిందని ప్రశంసించారు.

**స్టేట్ టెంపుల్గా మారిన ఒంటిమిట్ట -- అభివృద్ధికి శ్రీకారం**

2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒంటిమిట్టను స్టేట్ టెంపుల్గా ప్రకటించడంతో ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోయాయని గుర్తుచేశారు. ఆ నిర్ణయం ఒంటిమిట్టను రాష్ట్రవ్యాప్తంగా ఒక బ్రాండ్గా నిలబెట్టిందన్నారు.

**శ్రీరామ ఎత్తిపోతల పథకం -- కరువు నివారణకు దారి**

ఒంటిమిట్టలో కరువు సమస్యను పరిష్కరించేందుకు శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. మూడు సంవత్సరాలపాటు 365 రోజులు సాగు, తాగునీరు అందేలా రూ.12 కోట్లతో మూడు నెలల్లో పథకాన్ని నవీకరించేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు.

**వైసీపీ పాలనలో నిర్లక్ష్యం -- ఇప్పుడు వేగవంతమైన అభివృద్ధి**

మధ్యలో వైసీపీ ప్రభుత్వం ఒంటిమిట్ట అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం తిరిగి అభివృద్ధి పునరుద్ధరణతో పాటు కళ్యాణ మహోత్సవాన్ని గతంలో ఎన్నడూ లేనివిధంగా నిర్వహించామని తెలిపారు.

**ఆధ్యాత్మిక -- పర్యాటక హబ్గా ఒంటిమిట్ట**

ఒంటిమిట్టను తిరుమలకు దీటుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సంకల్పించారని తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ హైవే ద్వారా అనుసంధానం, ప్రత్యేక రహదారి నిర్మాణం ద్వారా నగర అభివృద్ధి మరింత వేగవంతం కానుందని చెప్పారు.

**ఒంటిమిట్ట చెరువు -- భారీ ప్రణాళికలు**

ఒంటిమిట్ట చెరువులో రూ.20 కోట్లతో ఆగమ శాస్త్ర పండితుల సూచనల మేరకు విగ్రహ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.

**ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేక కారిడార్**

రాజంపేట నియోజకవర్గం నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు తగ్గించేందుకు స్థానికంగానే పరిశ్రమల కారిడార్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారని చెప్పారు. కొత్త మాధవరం టెక్స్టైల్స్తో పాటు ఇతర పరిశ్రమల స్థాపనకు చర్యలు చేపడతామని వెల్లడించారు.

**హెలికాప్టర్ సర్వే -- సీఎం ప్రత్యేక దృష్టి**

ఒంటిమిట్ట నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ఇందుకోసం హెలికాప్టర్ ద్వారా ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించినట్లు తెలిపారు.

**అయోధ్య తర్వాత అంతటి ప్రాధాన్యం -- బొబ్బిలి రాయుడు**

టీడీపీ సీనియర్ నాయకుడు బొబ్బిలి రాయుడు మాట్లాడుతూ, దేశంలో ప్రసిద్ధి చెందిన రామాలయాల్లో అయోధ్య తర్వాత ఒంటిమిట్టకే స్థానం ఉందన్నారు. ప్రాచీన దేవాలయాల్లో ఒకటిగా నిలిచిన ఈ క్షేత్రం అభివృద్ధితో ఆధ్యాత్మికంగా, ఆర్థికంగా మారిపోతుందని అభిప్రాయపడ్డారు.

**'ఒంటిమిట్ట అంటే గౌరవం' -- ఎంపీపీ ప్రతినిధి సాలాబాద్ బుజ్జి**

ఎంపీపీ ప్రతినిధి సాలాబాద్ బుజ్జి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు సతీసమేతంగా కళ్యాణానికి హాజరై భారతీయ సంప్రదాయాలను యువతకు తెలియజేశారని కొనియాడారు. ఒంటిమిట్ట అంటే ఆధ్యాత్మికత, అభివృద్ధి, గౌరవం అనే భావన ఏర్పడిందన్నారు. ఒంటిమిట్ట రామయ్య కీర్తిని నలు దిశల వ్యాప్తి చేద్దాం– తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆలూరు వెంకటసుబ్బయ్య ఒంటిమిట్ట కోదండ రాముడు కళ్యాణం జగన్ మోహన్ రాజు కృషితో టిటిడి , జిల్లా అధికారుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించామని అన్నారు. ఒంటిమిట్ట కోదండరామయ్య కీర్తిని నలుదిక్కులా వ్యాప్తి చేద్దామని ఆయన అన్నారు.

**సమిష్టి కృషికి కృతజ్ఞతలు**

జగన్మోహన్ రాజు ప్రత్యేక కృషి, టీటీడీ అధికారులు, జిల్లా యంత్రాంగం సహకారంతో బ్రహ్మోత్సవాలు కనివిని ఎరుగని రీతిలో నిర్వహించగలిగామని నేతలు తెలిపారు. కళ్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఒంటిమిట్టను ఆధ్యాత్మిక, పర్యాటక, ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలు అమలు చేస్తోందని, త్వరలోనే ఈ ప్రాంతం తిరుమల సరసన నిలుస్తుందని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల అదుపులో అంతరాష్ట్ర సైబర్ నేరగాడు

**- డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.92 లక్షలు కొల్లగొట్టిన వైనం**

**- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి**



మదనపల్లె (ప్రజా సీమ) : కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులమంటూ ఫోన్ కాల్స్తో బెదిరించి, సామాన్యులను బురిడీ కొట్టిస్తున్న అంతరాష్ట్ర సైబర్ ముఠా గుట్టును అన్నమయ్య జిల్లా పోలీసులు రట్టు చేశారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సోమవారం మదనపల్లె జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు.మదనపల్లి టౌన్ అమ్మినేని వీధికి చెందిన ఆవుల విజయలక్ష్మి అనే వృద్ధురాలిని నిందితులు టార్గెట్ చేశారు.గత ఏడాది సెప్టెంబర్ మాసంలో ఆమెకు వీడియో కాల్ చేసిన తాము సిబిఐ,ఈడీ అధికారులమంటూ పరిచయం చేసుకున్నారు.ఆమె పేరు మీద డ్రగ్స్ కేసులు ఉన్నాయని,విచారణ పేరుతో డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామని భయభ్రాంతులకు గురిచేశారు.కేసు నుండి బయటపడాలంటే డబ్బులు పంపాలని నమ్మించి,విడతల వారీగా రూ.92,70,000 (తొంబై రెండు లక్షల డెబ్బై వేల రూపాయలు) దోచుకున్నారు. మదనపల్లి 1వ పట్టణ పోలీస్ స్టేషనులో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టారు.ఈ నేరంలో కీలక పాత్ర పోషించిన కర్ణాటక రాష్ట్రం బళ్ళారి జిల్లా సిరిగుప్పకు చెందిన లింగబలిజ విరూపాక్ష (24) అనే నిందితుడిని సోమవారం మదనపల్లి–అంగళ్ల రోడ్డులోని ఆర్.కె.టైల్స్ సమీపంలో పోలీసులు అరెస్ట్ చేశారు.నిందితుడి వద్ద నుంచి రూ.10 లక్షల నగదు,ఒక మొబైల్ ఫోన్,సిమ్ కార్డును స్వాధీనం చేసుకున్నారు.పరారీలో ఉన్న మరో ముగ్గురి ప్రధాన సూత్రధారుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.ఈ ముఠా కాంబోడియా,కువైట్ కేంద్రంగా పనిచేస్తున్న అంతర్జాతీయ సైబర్ ముఠాలతో సంబంధాలు కలిగి ఉందని,ఫేక్ ఎఫ్ఐఆర్లు,డ్రగ్ కేసుల పేరుతో బాధితులను భయపెట్టడం వీరి ప్రధాన వృత్తి అని,దోచుకున్న సొమ్మును తొలుత మ్యూల్ ఖాతాల్లోకి మళ్లించి,ఆపై ఏటీఎంల ద్వారా డ్రా చేసేవారన్నారు.సాక్ష్యాలు దొరకకుండా వాట్సాప్లో పంపిన డిపాజిట్ స్లిప్పులను వెంటనే డిలీట్ చేసి,నగదును వివిధ వ్యాపారాల పేరుతో లేయరింగ్ చేసి మళ్లించేవారని తెలిపారు.ప్రభుత్వ సంస్థలు ఎప్పుడూ ఫోన్ కాల్స్లో డబ్బులు అడగవని,బ్యాంకు వివరాలు కోరవని ఎస్పీ స్పష్టం చేశారు.ఎవరైనా సిబిఐ లేదా ఇతర విభాగాల పేరుతో భయపెడితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్కు ఫిర్యాదు చేయాలని సూచించారు.క్లిష్టమైన ఈ సైబర్ కేసును ఛేదించిన మదనపల్లె వన్ టౌన్ ఇన్స్పెక్టర్ కె.రాజారెడ్డి,సైబర్ క్రైమ్ సీఐ మహమ్మద్ అలీ,ఎస్ఐ రహీముల్లా వారి బృందాన్ని,సైబర్ క్రైమ్ పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కేసులో ప్రతిభ చూపిన పోలీసులకు నగదు రివార్డులు అందజేసి అభినందించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి పాల్గొన్నారు.

# అక్రమ గోవధ,పర్యావరణ కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి

**- పిజిఆర్ఎస్ లో రేగడి ప్రసాద్ కుమార్ వినతి**



మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె పట్టణంలో అక్రమ గోవధ,పర్యావరణ కాలుష్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో విఫలమైన అధికారులపై చర్యలు కోరుతూ రాయల్ యూత్ సొసైటీ అధ్యక్షులు రేగడి ప్రసాద్ కుమార్ జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సోమవారం రేగడి ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ స్థానిక బెంగళూరు బస్టాండ్ సమీపంలోని బడే మఖాన్ ప్రాంతంలో అక్రమంగా గోవధ బహిరంగంగా జరుగుతోందని,తద్వారా రక్తం,వ్యర్థాలను బాహుదా నదిలో కలుపుతున్నారని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఇది తీవ్రమైన పర్యావరణ కాలుష్యానికి కారణ మవుతోందని,ఈ కాలుష్యం నిమ్మనపల్లి బహుదా ప్రాజెక్ట్ వరకు చేరి రైతుల సాగు నీటిని ప్రభావితం చేయడంతోపాటు భూగర్భ జలాలను కలుషితం చేస్తోందన్నారు.ఇది వరకు తాను మూడుసార్లు గ్రీవెన్స్ నందు ఫిర్యాదు చేసినా అధికారుల నిర్లక్ష్యం,రాజకీయ ఒత్తిడి కారణంగా ఎటువంటి చర్యలు తీసుకొలేదన్నారు.ఇప్పటికైనా దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


# బీటెక్ విద్యార్థిని కి పెడన నియోజకవర్గం యాదవ యువత వితరణ



పెడన:ఏప్రిల్ 6 (ప్రజా సీమ) :ఆర్థిక ఇబ్బందులతో చదువుకుం టున్న విద్యార్థినిని పెడన నియోజ కవర్గం యాదవ యువత ఆదుకుంది.చల్లపల్లి మండలం మంగళాపురం గ్రామానికి చెందిన డొక్కు లక్ష్మీ ప్రియాంక బి.టెక్ సి ఎస్ ఇ మొదటి సంవత్సరం మంగళగిరి వివిఐటీ యూనివర్సిటీ లో చదువుతుంది. గత సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానాన్ని పొందింది. ఆమె తండ్రి ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో చనిపోయాడు. ప్రస్తుతం తల్లి సంరక్షణలోనే ఉంటుంది. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో వున్న విషయం తెలుసుకున్న పెడన నియోజకవర్గం యాదవ యువత స్పందించి కొలుసు చందు యాదవ్ ఆధ్వర్యంలో 75 వేల రూపాయలు కలెక్ట్ చేసింది. విద్యార్థి ఇంటికి సంఘం నాయకులు సోమవారం వెళ్లి అసొమ్ము ను విద్యార్థి కి అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మీడియా అసోసియేషన్ కృష్ణాజిల్లా వైస్ ప్రెసిడెంట్ పుట్టి కృష్ణ ప్రసాద్ కొలుసు చందు బోయిన నాగరాజు గంగు మోలు శివన్నారాయణ కోరసిక బాలు కొలుసు నిహార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమంగా నీటి భద్రత

## తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు






రాజంపేట,(ప్రజా సీమ) :ఆంధ్రప్రదేశ్‌ను కరవు రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో,భూగర్భజలాలను పెంచడానికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగా జలభద్రత – నీటి సంఘాల బాధ్యతేనని,ప్రతి ఎకరాకు నీరు అందేలా మరియు నీటి వృధాను అరికట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు. సోమవారం ఆయన రాంనగర్ లో "సాగునీటి భద్రత–సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమాన్ని నీటి సంఘం అధ్యక్షులు నాగినేని నాగేశ్వర్ నాయుడు మరియు ఇరిగేషన్ అధికారులు ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ వేసవికి ముందు 6 మీటర్లు,వర్షాకాలం నాటికి 3 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండేలా,నీటి సంరక్షణ,జలవనరుల పరిరక్షణపై వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారని.. ఇందులో భాగంగా గ్రామస్థాయిలో సాగునీటి వనరులను కాపాడుకోవడం, కాలువలు మరియు చెరువులు పూడికతీత,కట్టలు బలోపేతం వంటి చర్యలు చేపట్టాలన్నారు. నీటి నిల్వలను పెంచడానికి మరియు భూగర్భ జల మట్టాలను పెంచడానికి ప్రభుత్వం 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందని, వేసవిలో 6 మీటర్లు,వర్షపు సీజన్లో 3 మీటర్ల లోతుకు నీటి మట్టాన్ని తీసుకురావడమే ప్రధాన లక్ష్యమన్నారు. అంతేకాకుండా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని కరవు రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వము పనిచేస్తోందని తెలిపారు.వర్షపు నీటిని నిల్వ చేయడం,జలవనరులను కాపాడుకోవం ద్వారా రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి నీటి భద్రత కల్పించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంతటి బృహత్తర సంకల్పంతో ముందుకు వెళుతుంటే గత వైసిపి పాలనలో పోలి చెరువు అన్యాక్రాంతం అయిందని,వందలాది ఎకరాలు ఆక్రమణకు గురైందని,పోలి చెరువు ఆక్రమణదారులు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. అంతేకాకుండా ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి ఆదర్శంగా రాజంపేట నియోజకవర్గంలోని మన్నూరు మరియు నందలూరు చెరువులు నిలిచాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నెశసుబ్బ నరసయ్య నాయుడు,సొసైటీ చైర్మన్ ములుగూరి సుబ్రహ్మణ్యం నాయుడు,నీటిపారుదల శాఖ అధికారులు,రాజంపేట ఎంపీడీవో, మాజీ మండల అధ్యక్షులు బాపనయ్య నాయుడు,లీగల్ సెల్ పార్లమెంట్ అధ్యక్షులు టి లక్ష్మీనారాయణ,ప్రముఖ డాక్టర్ నవీన్ కుమార్,మాజీ పట్టణ అధ్యక్షులు సంజీవరావు,డైరెక్టర్లు కోనంకి మల్లికార్జున,గురజాల రెడ్డయ్య,కోవూరు పరశురాం, పలువురు పార్టీ ముఖ్య నాయకులు రైతులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలుచోట్ల పార్టీ జెండా ఆవిష్కరణ






రైల్వేకోడూరు ( ప్రజాసేన) : తిరుపతి జిల్లా రైల్వేకోడూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో. భారతీయ జనతా పార్టీ 46 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలుచోట్ల జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ పార్టీ జెండా ఆవిష్కరణలో నియోజకవర్గంలోని బిజెపి పార్టీ నాయకులు అందరూ పాల్గొనడం జరిగిందని తెలిపారు అంతేకాకుండా ఈ కార్యక్రమంలో బిజెపి మండలాధ్యక్షుడు సాయం శ్రీధర్, వాకచర్ల సుబ్బారావు, రాము, బిజెపి పార్టీ మహిళా నాయకులు కుప్పాల జ్యోతి ,కిరణ్ చాటకొండ సుబ్రమణ్యం మొదలగు వారు పాల్గొన్నారు.

# సాగునీటి అవసరాలకు పొదుపుగా ఉపయోగించుకోవాలి

## -మంత్రి కొల్లు రవీంద్ర




(ప్రజా సీమ) మచిలీపట్నం ఏప్రిల్ 6: నీటిని భద్రపరచుకొని రాబోయే రోజుల్లో త్రాగునీరు, సాగునీటి అవసరాలకు పొదుపుగా ఉపయోగించుకోవాల్సిన బాధ్యత సాగునీటి సంఘాలు, ప్రజలపై ఉందని రాష్ట్ర గనులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం మంత్రి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణలతో కలిసి మచిలీపట్నం మండలంలోని పొట్లపాలెం గ్రామపంచాయతీలోని కొత్తపూడి గ్రామంలోనీ చెరువులో పూడికతీత పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి అనంతపురం జిల్లాలో ప్రారంభించారన్నారు. ప్రతి వర్షపు నీటి బొట్టును వృధా కాకుండా చెరువుల్లో నింపుకొని పొదుపుగా సాగునీటికి, తాగునీటికి ఉపయోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఇందుకోసం 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని చెరువులను గుర్తించి అందులో పూడిక తీత పనులను చేపట్టాలన్నారు. అంతేకాకుండా రైతులు సాగునీటి సంఘాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారికి సంపూర్ణ అవగాహన కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కృష్ణా, గోదావరి, తుంగభద్ర ఆనకట్టలు వాటి దిగువన ఉన్న పెద్దపెద్ద కాలువలు అన్నీ కూడా నీటి ప్రవాహం సజావుగా జరిగేలా శివారు ప్రాంతాలకు సాగునీరు అందేలా వాటిల్లోని పూడికను తొలగించాలన్నారు. ఆ విధంగా తమ ప్రభుత్వం వచ్చాక దాదాపు 640 టీఎంసీల నీటిని పెంచుకోగలిగేమన్నారు గతంలో భూగర్భ జలాల మట్టం సరాసరి 10.62 మీటర్లు కాగా నేడు 8.70 మీటర్లకు వచ్చిందన్నారు. ప్రస్తుతం చేపడుతున్న కొత్తపూడి గ్రామంలో 5 ఎకరాల్లో చెరువు ఉందని ఇందులో పూడిక తీసి నీటిని నింపుకుంటే భూగర్భ జలాలు బాగా పెరుగుతాయన్నారు. రాష్ట్రం మొత్తం సాగునీటికి 890 టీఎంసీలు, పరిశ్రమలకు 28 టీఎంసీలు, తాగునీటికి 150 టిఎంసిలు మొత్తం 1270 టీఎంసీలు నీరు అవసరం ఉందన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం నదులను అనుసంధానం చేయడానికి శ్రీకారం చుట్టిందన్నారు.ఈ ప్రాంతంలో 3 లక్షల మంది శ్రామికులకు ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. 165 కోట్ల రూపాయల మేరకు ఉపాధి పనులు జరిగాయన్నారు. అందులో 108 కోట్ల రూపాయలు సిమెంటు తదితర మెటీరియల్ కంపోనెంట్ కింద ఖర్చు చేయడం జరిగిందన్నారు. వేసవి కాలంలో ఉపాధి పనులకు వచ్చే శ్రామికులకు ఏలాంటి ఇబ్బంది కలగకుండా మంచినీరు ఓఆర్ఎస్ మేడ వంటి ప్రాథమిక చికిత్స కిట్లను అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రాంతంలో రహదారులు నిర్మించామని, ఉన్నాయని త్వరలో మురికి కాలువల నిర్మాణం కూడా చేపడతామన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ ప్రకృతిలో మనకు కొన్ని నెలలు మాత్రమే వర్షాలు కురిసి నీరు వస్తుందని వాటిని దాచుకొని అవసరాన్ని బట్టి పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. చెరువుల్లో నీటిని నింపుకోవడం వల్ల చుట్టుపక్కల గ్రామాల్లో భూగర్భ జలాల మట్టం పెరుగుతుందన్నారు. చెరువుల్లో కూడిక తీయకపోవడంతో వర్షపు నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయి భూగర్భ జలాలు కూడా తగ్గిపోతున్నాయన్నారు. చెరువుల్లో పుష్కలంగా నీరు ఉంటే మనుషులకు, పశువులకు తాగడానికి అందరికీ ధైర్యంగా ఉంటుందన్నారు. చెరువుల్లో పూడిక తీసే కార్యక్రమాన్ని 100 రోజులపాటు చేపట్టనున్నామన్నారు. మొదట 10 రోజులు పూడికలు తీయవలసిన చెరువులను గుర్తించాలన్నారు. గుర్తించిన చెరువుల్లో పూడిక తీసే పనుల ద్వారా శ్రామికులకు ఉపాధి లభించి ఆదాయం కూడా వస్తుందన్నారు.పంట కాలువల్లో కూడా మట్టి పేరుకుపోయి నీరు సరిగా ప్రవహించక శివారు ప్రాంతాలకు సాగునీరు అందని పరిస్థితి ఉందన్నారు. అందువలన పంట కాలువల్లో కూడా పూడిక తీసే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. చెరువుల్లో నీటిని నింపుకోవడం వల్ల బోరు బావుల్లో కూడా భూగర్భ జలాలు పెరుగుతున్నాయన్నారు. సాగునీటి సంఘాల ప్రతినిధులు రైతులు కూర్చొని సంవత్సరం పొడుగునా సాగునీరు ఉండే విధంగా ఏం చేస్తే బాగుంటుందో పనులను గుర్తించి జాబితా తయారు చేయాలన్నారు. ఇదే విధానంలో అన్నమయ్య జిల్లాలో అమలుపరిస్తే మంచి ఫలితాలు వచ్చాయని దీంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్నిచోట్ల ఈ పద్ధతిని అనుసరించాలని సూచించిందన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని నీటిని నిలువ చేసుకొని శుద్ధిచేసి పొదుపుగా ప్రతి ఇంటికి సరఫరా చేయాలన్నారు. పంట కాలువల ద్వారా శివారు ప్రాంతాలకు కూడా సాగునీరు అందించే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకోసం కొత్తగా అంచనాలు రూపొందించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందు కోసం ఉపరితల జలాశయాల ద్వారా అన్ని ప్రాంతాలకు నీటిని సరఫరా చేయవలసి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో డ్వామా పీడి శివప్రసాద్, జలవనరుల శాఖ ఎస్ఇ గుణకర్, భూగర్భ జల శాఖ డిడి బిందు శ్రీ, జలవనరుల శాఖ ఈ ఈ రవికిరణ్, డి ఈఈ అపర్ణ,, ఆర్డబ్ల్యూఎస్ డీఈఈ సుధాకర్, ఏఈ సుగుణ, తహసిల్దారు నాగభూషణం, డిప్యూటీ ఎంపీడీవో బాలకృష్ణ రావు, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, జిల్లా నీటి సంఘాల అధ్యక్షులు దేవన బోయిన వెంకటేశ్వరరావు, రైతులు గ్రామస్తులు, శ్రామికులు పాల్గొన్నారు.

# ప్రజల నుండి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారు..!

వింజమూరు, ఏప్రిల్ 6 (ప్రజా సీమ) : వింజమూరు ఏప్రిల్ 6న తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో గౌరవ ఉదయగిరి శాసనసభ్యులు శ్రీ కాకర్ల సురేష్ గారు నాయకులు, కార్యకర్తలు, అలాగే నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సేవలో తన నిబద్ధతను మరోసారి చాటిచెప్పారు. ప్రజల నుండి వచ్చిన వినతులు, ఫిర్యాదులను స్వయంగా ఓర్పుతో ఆలకించి, ప్రతి సమస్యను సమగ్రంగా పరిశీలిస్తూ సంబంధిత శాఖల అధికారులతో వెంటనే చర్చలు జరిపారు. సమస్యల స్వభావాన్ని బట్టి తక్షణ చర్యలు తీసుకోవాలని, ఆలస్యం లేకుండా ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను స్పష్టంగా ఆదేశించారు. ప్రజల కష్టాలు తమవేనన్న భావంతో, ప్రతి వినతిని గౌరవంగా స్వీకరించి పరిష్కారం చూపించేందుకు కృషి చేస్తున్న శ్రీ కాకర్ల సురేష్ గారి ప్రజా సేవా తత్వం అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికి విశ్వాసాన్ని కలిగించింది.

# ఆరోగ్యం



# బీర్ అంటే తెగ లైక్ చేస్తారా.. తల్లి కడుపుతో ఉన్నప్పుడే దీనికి బీజం!

ఎండాకాలం వచ్చిందంటే చాలు బీర్ తాగేవాళ్ల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుంది. మిగతా సమయాల్లో వారానికి ఒక సారి తాగేటోళు ఎండాకాలంలో రోజూ రెండు బీర్లు అయినా తాగుతుంటారు. మద్యపానం చేసేవాళ్లలో చాలామందికి బీర్ అంటే పిచ్చి ఇష్టం ఉంటుంది. అయితే బీర్ అంటే ఎందుకు అంత ఇష్టం అని అడిగితే దీనికి సమాధానం చెప్పలేరు. జస్ట్ ఇష్టం అంతే అని జవాబిస్తారు. వాస్తవానికి దీని వెనుక పెద్ద కథే ఉంది. బీర్ పట్ల ఇష్టం అనేది సాధారణంగా యుక్తవయస్సులో లేదా వయోజన దశలో మొదలవుతుంది. కానీ కొందరు వ్యక్తులలో ఈ ఇష్టం తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచే డెవలప్ అవుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. అది టెస్టోస్టెరాన్ తో ముడిపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. గర్భంలో పురుష లైంగిక హార్మోన్ కు ఎక్కువగా గురికావడం దీనికి ఓ ముఖ్య కారణం అని కూడా చెబుతున్నారు.

చూపుడు వేలు కంటే ఉంగరపు వేలు పొడవుగా ఉన్న పెద్ద మహిళల పిండాల్లో అధిక టెస్టోస్టెరాన్ స్థాయిల సంకేతం కనిపిస్తుంది. ఒక అధ్యయనంలో ఆ వ్యక్తులు దశాబ్దాల తర్వాత కూడా తాగారని తేలింది. మద్యపానం విషయంలో తేడాలు గర్భంలోనే ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు. అమెరికన్ జర్నల్ ఆఫ్ హ్యూమన్ బయాలజీలో ప్రచురితమైన అధ్యయన వివరాల ప్రకారం కుడి చేతిలో పొడవాటి ఉంగరపు వేళ్లు ఉన్న పురుషులకు అత్యంత బలమైనది. టెస్టోస్టెరాన్ ఎక్కువగా ఉండటం, పురుష శక్తి ఎక్కువగా ఉండటం వల్ల ఆల్కహాల్ సహనం పెరుగుతుందని, ఫలితంగా మద్యపాన అలవాట్లు పెరుగుతాయని ఓ నిపుణుడు తెలిపారు. పురుషుల కడుపులోని ఎంజైమ్‌లు ఆల్కహాల్ శోషణను 30 శాతం తగ్గించగలవు, అయితే ఆడవాళ్ళు రక్తప్రవాహంలోకి ఎక్కువగా శోషించుకుంటారని తెలిపారు. టెస్టోస్టెరాన్ ఎక్కువగా ఉండటం, పురుష శక్తి ఎక్కువగా ఉండటం వల్ల ఆల్కహాల్ సహనం పెరుగుతుందని ఫలితంగా మద్యపాన అలవాట్లు పెరుగుతాయని తెలిపారు.

## బల్లగుద్ది చెప్తున్నా.. ఇలాంటి టీ మీరు జన్మలో తాగి ఉండరు, ప్రయోజనాలు మాత్రం అదుర్స్, ఎలా చేసుకోవాలంటే?



మీరు ఇప్పటి వరకు చాలా రకాల టీలు తాగి ఉంటారు. సాధారణ టీ, అల్లం టీ, గ్రీన్ టీ, బెల్లం టీ.. ఇలా ఎన్నో రకాల టీలను రుచి చేసి ఉంటారు. కానీ మీరెప్పుడైనా రోజ్ టీ తాగారా?. మీలో చాలా మంది చెప్పే సమాధానం నో. అయితే ఈ టీ తాగడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. బ్యూటీ ప్రొడక్ట్స్‌తో వాడే రోజ్‌తో టీ చేసుకొని తాగడం వలన ఆరోగ్యానికి, అందానికి కూడా చాలా మేలు జరుగుతుంది. ఇంతకీ ఈ రోజ్ టీ ఎలా చేసుకోవాలి? దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనే దానితో పాటు.. ఈ టీ వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటి అనేది కూడా తెలుసుకుందాం.

కావాల్సిన పదార్థాలు: తాజా గులాబీ రేకులు: 1 కప్పు నీరు: 2 కప్పులు తేనె లేదా చక్కెర: రుచికి సరిపడా నిమ్మరసం: కొన్ని చుక్కలు టీ ఆకులు.

తయారీ విధానం: ఈ రోజ్ టీ తయారు చేసుకోవడానికి ముందుగా గులాబీ రేకులను శుభ్రం చేసుకోవాలి. ఇలా చేసుకోవడం వల్ల అందులో ఏమైనా పురుగులు లేదా రసాయనాలు ఉంటే అవి క్లియర్ అయిపోతాయి. ఆ తరువాత ఆ గులాబీ రేకులను ఓ గిన్నెలో తీసుకొని బాగా నీరు పోసుకొని మారగించుకోవాలి. ఒకవేళ మీకు టీ ఆకులు కావాలనుకుంటే.. గులాబీ రేకులతో పాటు టీ ఆకులు కూడా వేసుకొని మరించుకోవచ్చు. అలా మరిగిన తరువాత.. ఆ నీటిని వడగట్టి ఓ గ్లాసులో తీసుకోవాలి. అందులో రుచికి సరిపడా చెక్కెర(కావాలనుకున్న వాళ్ళు తేనె కూడా యాడ్ చేసుకోవచ్చు), కొద్దిగా నిమ్మరసం వేసుకొని బాగా కలుపుకోవాలి. ఆ తరువాత ఆ టీని ఆస్వాదించడమే. రుచి మాత్రం అద్భుతంగా ఉంటుంది. రోజ్ టీ వల్ల కలిగే ప్రయోజనాలు: రోజ్ టీలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి. అలాగే రోజ్ టీ చర్మాన్ని తేమగా ఉంచడానికి, మంటను తగ్గించడానికి సహాయపడుతుంది. దీంతో పాటు ఇది ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. అలాగే ఒత్తిడిని తగ్గించి, మంచి నిద్ర పట్టే విధంగా సహాయపడుతుంది. రోజ్ టీ రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది, అలాగే మానసిక ఆరోగ్య స్థితిని మెరుగుపరుస్తుంది.

తెలుగు వంటలు

### మిగిలిపోయిన ఇడ్లీతో

## ఈ రొట్టెలు చేసుకోండి



సాధారణంగా ఎక్కువ మంది ఇంట్లో ఉదయాన్నే ఉండే బ్రేక్‌ఫాస్ట్ ఏదైనా ఉందంటే అది ఇడ్లీ. దీనిని సులభంగా చేసుకోవడంతో పాటు ఖర్చు కూడా తక్కువగా ఉండడంతో ఎక్కువగా ఇడ్లీలు చేసుకోవడానికి ఇష్టపడుతుంటారు. ఈ క్రమంలో పిండి మిగిలిపోతే, వాటిని పారేస్తుంటారు. అయితే ఈసారి మీరు ఇడ్లీ చేసుకునేటప్పుడు పిండి మిగిలిపోతే, ఆ పిండితో ఈ విధంగా కొబ్బరి రొట్టెలు తయారు చేసుకోండి. చాలా సులభమైన పద్దతిలో దీనిని చేసుకోవచ్చు. ఇది చాలా రుచికరంగా కూడా ఉంటుంది. అయితే దీనిని ఎలా చేసుకోవాలి? కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

కొబ్బరి రొట్టె తయారీకి కావాల్సిన పదార్థాలు ఇడ్లీ పిండి - 2 కప్పులు పచ్చి కొబ్బరి - ఒక కప్పు పావు కప్పు బెల్లం సరిపడా నూనె లేదా నెయ్యి

కొబ్బరి రొట్టెలు తయారీ విధానం మిగిలిపోయిన ఇడ్లీ పిండితో రొట్టెలు వేసుకోవడానికి ముందుగా ఒక బౌల్ తీసుకోవాలి. అందులో ఇడ్లీ పిండిని వేసుకోవాలి. అలాగే అందులో కొబ్బరి తురుమును కూడా వేసుకొని మెత్తగా కలుపుకోవాలి. అలాగే అందులోనే బెల్లాన్ని కూడా పొడిగా చేసుకొని అందులో వేసుకోవాలి. ఇప్పుడు ఆ పిండిని బెల్లం, కొబ్బరి పొడి, బెల్లం పొడి మొత్తం బాగా కలిసే విధంగా కలుపుకోవాలి. ఇలా కలుపుకున్న మిశ్రమాన్ని ఓ పది నుంచి పదిహేను నిమిషాల పాటు పక్కన ఉంచుకోవాలి. ఇప్పుడు ఒక చిన్న కడాయి తీసుకొని, దానికి కింద నెయ్యి పూసుకోవాలి. ఇప్పుడు అందులోనే కాస్త మందంగా పిండిని పోసుకోవాలి. ఆ తరువాత సన్నటి మంట మీద ఆ రొట్టెను 5 నుంచి పది నిమిషాల పాటు బాగా కాలనివ్వాలి. అప్పుడే రొట్టె లోపలి భాగం కూడా బాగా కాలుతుంది. అలా రెండు వైపులా రొట్టెను కాల్చుకొని దించుకుంటే ఎంతో రుచికరమైన కొబ్బరి రొట్టె సిద్ధమైనట్లే.

## అద్భుతమైన పౌష్ఠికాహారం ఇదే..

### డయాబెటిస్ ఉన్నోళ్లు కూడా తినొచ్చు,జొన్న ఖిచిడి ఎలా చేయాలంటే





ఈ మధ్యకాలంలో మిల్లెట్స్ కు డిమాండ్ విపరీతంగా పెరుగుతోంది. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటే చాలు ఇంకేం అక్కర్లేదు అని భావిస్తుండటమే దీనికి ప్రధాన కారణం. మిల్లెట్స్ లో ఒకటైన జొన్నలలో ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, ఇతర ముఖ్యమైన ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. జొన్నలలో అధికంగా ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, మలబద్ధకాన్ని నివారిస్తుంది. జొన్నలు శరీరానికి చలువ చేస్తాయి. చర్మం,జుట్టు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతాయి. జొన్నలతో చేసే ఖిచిడీ ఎప్పుడైనా తిన్నారా? వాస్తవానికి జొన్న ఖిచిడి ఒక సంప్రదాయ దక్షిణ భారత వంటకం. ఇది అద్భుతమైన రుచికి పెట్టింది పేరు, ఆరోగ్యకరమైనది కూడా. బరువు తగ్గాలనుకునేవారికి ఇదోక సూపర్ ఫుడ్. ఎవ్వరైనా దీనిని తినవచ్చు. డయాబెటిస్ పేషెంట్లు కూడా హాయిగా తినగలిగే జొన్న ఖిచిడి ఎలా చేయాలో ఇక్కడ చూడండి.

జొన్న ఖిచిడి తయారీకి కావాల్సిన పదార్థాలు జొన్న రవ్వ - 1 కప్పు పెసర పప్పు - 1/2 కప్పు నీరు - 4 కప్పులు ఉల్లిపాయ - 1 టమోటా - 1 క్యారెట్ - 1 బంగాళాదుంప - 1 పచ్చి బఠానీలు - 1/4 కప్పు పచ్చిమిర్చి - 2 అల్లం - 1 అంగుళం ఆవాలు - 1/2 టీస్పూన్ జీలకర్ర - 1/2 టీస్పూన్ కరివేపాకు - కొన్ని ఆకులు నూనె - 2 టేబుల్ స్పూన్లు ఉప్పు - రుచికి సరిపడా కొత్తిమీర - కొద్దిగా.

జొన్న ఖిచిడి తయారీ విధానం -ముందుగా పెసర పప్పును ఒక గిన్నెలో వేసి శుభ్రంగా కడిగి 30 నిమిషాలు నానబెట్టాలి. -జొన్న రవ్వను కూడా ఒకసారి కడిగి పక్కన పెట్టుకోవాలి. -స్టవ్ మీద ఒక కుక్కర్ పెట్టి ఆయిల్ వేడి చేసి అందులో ఆవాలు, జీలకర్ర,కరివేపాకు, చిన్నగా కట్ చేసిన పచ్చిమిర్చి ముక్కలు, ఉల్లిపాయ చీలికలు వేసి, అల్లం తురుము వేసి వేయించాలి. -ఉల్లిపాయ ముక్కలు వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించిన తర్వాత ఇందులో టమోటా ముక్కలు వేసి మెత్తబడే వరకు వేయించాలి. -తర్వాత అందులో క్యారెట్ ముక్కలు, బంగాళాదుంప ముక్కలు, పచ్చి బఠానీలు వేసి 2-3 నిమిషాలు వేయించాలి. -తర్వాత అందులో నానబెట్టిన పెసర పప్పు వేసి కలపాలి. -ఇప్పుడు అందులో జొన్న రవ్వ, నీరు, ఉప్పు వేసి బాగా కలపి కుక్కర్ మూత పెట్టి 2-3 విజిల్స్ వచ్చేవరకు ఉడికించాలి. -తర్వాత మూత తీసి కొత్తిమీర చల్లి స్టవ్ ఆఫ్ చేస్తే వేడి వేడి జొన్న ఖిచిడి రెడీ. -వేడి వేడి జొన్న కిచిడిని పెరుగు లేదా నచ్చిన చట్నీతో తింటే అద్భుతంగా ఉంటుంది.

ప్రజాసీమ
PRGI Regd. No : APTEL/26/A0819
జాతీయ తెలుగు దినపత్రిక



# సినిమా న్యూస్





## పర భాష నటుల కామెంట్‌పై జేడీ ఒపీనియన్ ఇదీ!

టాలీవుడ్ ఆర్టిస్ట్‌లని విస్మరిస్తూ కొంత మంది డైరెక్టర్లు, నిర్మాతలు పర భాషలకు చెందిన నటీనటులని ఎక్కువగా తెలుగు కోసం తీసుకొస్తున్నారని, దాని వల్ల తెలుగులో ఉన్న టాలెంటెడ్ ఆర్టిస్ట్‌లకు పని లేకుండా పోతోందనే కామెంట్‌లు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. కోట శ్రీనివాసరావు లాంటి నటులు బాహాటంటానే దీనిపై కామెంట్‌లు చేశారు. ప్రకాష్ రాజ్ లాంటి పర భాష నటులని ప్రోత్సహిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని విమర్శలు గుప్పించారు. తాజాగా ఇదే తరహా ప్రశ్న జెడీ చక్రవర్తికి ఎదురైతే ఆయన ఆసక్తికరంగా స్పందించారు. చాలా కాలంగా తెలుగు సినిమాలకు దూరంగా ఉంటూ వస్తున్న జెడీ చక్రవర్తి తెలుగులో తరుణ్ భాస్కర్ కథానాయకుడిగా నటించిన -గాయపడ్డ సింహం-లో నటించారు. మే 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో జేడీ చక్రవర్తి పాల్గొని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగు ఆర్టిస్ట్‌లను పక్కన పెట్టి పర భాష నటులను తీసుకుంటున్నారు అన్నది కరెక్ట్ కాదు. మా లాంటి నటులను ముందుగా అప్రోచ్ అయినా మా లాంటి వాళ్లు కొన్ని సార్లు నో చెప్పడం వలన వేరే భాష నటులకు వెళ్లివుండవచ్చు- అన్నారు. లేదా కొన్ని సందర్భాలలో ఆ క్యారెక్టర్‌కు వాళ్లు మాత్రమే సరిపోతారని భావించి దర్శకుడు తీసుకున్న నిర్ణయం కూడా అయివుండోచ్చు. అంతే కానీ మన తెలుగు వాళ్లని పక్కన పెట్టి పర భాష నటుల కోసం వెళుతున్నారు అనేది కరెక్ట్ కాదు. క్యారెక్టర్ ఫిట్‌నెస్ అనేది ఒకటి ఉంటుంది. కొన్ని క్యారెక్టర్లకు దర్శకుడు ఎవరిని అనుకుంటున్నారో వాళ్లే సరిపోతారు- అన్నారు. ఇదే సందర్భంగా థియేటర్స్‌ని టెంపుల్స్ అంటారు కదా? దీనిపై మీ ఒపీనియన్ అని అడిగితే తనదైన శైలిలో స్పందించారు. థియేటర్ టెంపుల్ అయితే మీరు స్నానం చేసే థియేటర్స్‌కు వెళుతున్నారా?..గాళ్ ఫ్రెండ్‌తో పక్కన కూర్చుని సినిమా చూస్తున్నారా? ..టెంపుల్‌లో ఇవన్నీ చేస్తారా ఎవరైనా? థియేటర్ అనేది ఒక క్రియేటివ్ ప్లేస్. అక్కడికి వెళ్లి ఎంటర్‌టైన్ అవ్వాలనుకుంటారు. టెంపుల్‌కి ఎంటర్‌టైన్‌మెంట్‌కి వెళతామా? ఇది ఏంటంటే చెప్పుకోవడానికి బాగుంటాయిని కాయినింగ్ చేస్తుంటారు. ఆ సౌండింగ్ నచ్చి మిగతా వాళ్లు ఫాలో అవుతారు- అంటూ సెటైర్లు వేశారు. జెడీ చక్రవర్తి వేసిన సెటైర్లు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## బ్లాక్ అవుట్ ఫిట్ లో హీట్ పుట్టిస్తున్న దిశాపటాని!



అవకాశాలతో పని లేకుండా సోషల్ మీడియా ద్వారా పాపులారిటీని పెంపొందించుకుంటూ తమ అందంతో ఊహించని క్రేజ్ సొంతం చేసుకుంటున్న హీరోయిన్స్ ఈ మధ్యకాలంలో ఎక్కువే అని చెప్పాలి. ముఖ్యంగా కొంతమంది యూట్యూబ్ ద్వారా ఆదాయాన్ని ఘడిస్తుంటే.. మరికొంతమంది ఇలా ఇంస్టాగ్రామ్, ట్విట్టర్ వేదికగా అందాలు ఆరబోస్తూ ఆదాయాన్ని పెంపొందించుకుంటు న్నారు. అంతేకాదు కొన్ని బ్రాండ్లను ప్రమోట్ చేస్తూ ఈ సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్ వేదికగా ఊహించని క్రేజ్ అందుకుంటున్న విషయం తెలిసిందే. ఇకపోతే కొంతమంది వరుస సినిమాలతో బిజీగా ఉంటూనే మరొకవైపు అభిమానులను ఆకట్టుకోవడానికి గ్లామర్ వలకబోస్తూ సోషల్ మీడియాను పునాదిగా వేసుకుంటున్నారు. అలాంటి వారిలో ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ దిశాపటాని కూడా ఒకరు. ప్లేస్ తో సంబంధం లేకుండా గ్లామర్ వలకబోయడమే ప్రధానంగా చేసుకుంటూ అందంతో ఆకట్టుకునే ఈ ముద్దుగుమ్మ.. తాజాగా బ్లాక్ అవుట్ ఫిట్ లో అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులలో హీట్ పెంచే ప్రయత్నం చేసింది. అసలే సమ్మర్ పైగా బ్లాక్ డ్రెస్ ధరించి సెగలు పుట్టించే గ్లామర్ వలకబోస్తూ దిశాపటాని షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో మంట రాజేస్తున్నాయి. దిశాపటాని బాలీవుడ్ నటి అయినప్పటికీ అవకాశం లభించింది మాత్రం తెలుగులోనే.. తొలిసారి లోఫర్ సినిమాతో సినిమా ఇండస్ట్రీలోకి నటిగా అడుగు పెట్టింది.. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో మౌని అనే పాత్ర పోషించి ప్రేక్షకులను మెప్పించింది. అటు బాలీవుడ్ లో ఎంఎస్ ధోని ది అన్ టోల్డ్ స్టోరీ సినిమాతో బాలీవుడ్ రంగ ప్రవేశం చేసి మొదటి సినిమాతోనే అక్కడ ఊహించని క్రేజ్ సొంతం చేసుకుంది. తెలుగు, హిందీ మాత్రమే కాదు 2017లో చైనీస్ భాషలో సినిమా చేసి అలరించిన దిశాపటాని ఇక హిందీలోనే సినిమాలు చేస్తూ వచ్చింది. అటు సినిమాలతో పాటు ఇటు మ్యూజిక్ వీడియోస్ లో కూడా కనిపించిన ఈ ముద్దుగుమ్మ .. తన చిత్రాలతో పలు అవార్డులను కూడా దక్కించుకుంది దిశా పటాని. ఇకపోతే పలు ఇంటర్వ్యూలలో పాల్గొంటూ ఎన్నో విషయాలను పంచుకునే దిశా పటాని గతంలో తన ఫస్ట్ క్రష్ గురించి కూడా చెప్పుకు వచ్చింది. దిశా పటాన్ని మాట్లాడుతూ.. నేను స్కూల్లో ఉన్నప్పుడు రణబీర్ కు పెద్ద అభిమానిని. ఆయన పోస్టర్ చూస్తూ ఎన్నోసార్లు ప్రమాదంలో పడాల్సిన పరిస్థితి వచ్చింది ..మా నగరంలో ఆయనకు సంబంధించిన పెద్ద పెద్ద పోస్టర్లు ఉండేవి ఇక ఆయనను చూస్తూ అలా ఉండిపోయేదాన్ని అంటూ దిశాపటాని తెలిపింది.

## అలా మాట్లాడితే జాన్వీకి కోపం వస్తుందట..!



బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా దేశంలోని అన్ని భాషల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసి, అభిమాన హీరోయిన్‌గా నిలిచిన అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలిగా జాన్వీ కపూర్ ఎంట్రీ ఇచ్చింది. శ్రీదేవికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరూ హీరోయిన్స్‌గానే ఇండస్ట్రీలో ఉన్నారు. అయినా కూడా అంతా జాన్వీ కపూర్ గురించి మాట్లాడుకుంటారు. అందుకు కారణం ఆమె అందం, ఆమె సోషల్ మీడియా పోస్టులు అనడంలో ఎలాంటి సందేహం లేదు. బాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయినా కమర్షియల్ బ్రేక్ దక్కించుకోలేక పోయిన జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో షేర్ చేసే అందమైన ఫోటోల కారణంగా వార్తల్లో నిలుస్తుంది. దాంతో హీరోయిన్‌గా ఆఫర్లను దక్కించుకుంటూ ఉంటుంది. జాన్వీ కపూర్ గురించి సినిమాల్లో కంటే సోషల్ మీడియాలో ఎక్కువగా ఉంటుంది అనే విమర్శ ఉంది. అయినా పట్టించుకోకుండా జాన్వీ కపూర్ తన పని తాను చేసుకుంటూ వెళ్తుంది. జాన్వీ కపూర్ ఫోటోలు రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో వైరల్ కావడం మనం చూస్తూ ఉంటాం. తన ఫోటో షూట్ ఫోటోలను జాన్వీ స్వయంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేయడం లేదంటే, ఏదైనా కార్యక్రమంకు వెళ్లిన సమయంలో మీడియా ఫోటోగ్రాఫర్లకు ఫోజ్‌లు ఇవ్వడం ద్వారా సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటుంది. జాన్వీ కపూర్ ఎక్కువగా పాపరాజీల దృష్టిని ఆకర్షించే విధంగా ఔట్ ఫిట్‌ను ధరిస్తుంది అనే టాక్ కూడా ఉంది. గతంలో పలు సార్లు పాపరాజీల గురించి పాజిటివ్‌గా మాట్లాడిన జాన్వీ కపూర్ తాజాగా ఒక చిట్ చాట్ సందర్భంగా వారు అప్పుడప్పుడు చేసే వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేసింది. సందర్భానుసారంగా తాను ధరించిన డ్రెస్‌ను పాపరాజీలు ఇష్టానుసారంగా ఫోటోలు తీసుకుని, అందంగా లేదు అంటూ కామెంట్ చేయడంపై ఆమె తాజా చిట్ చాట్‌లో స్పందించింది. తన ఫోటోలను కొన్ని యాంగిల్స్‌లో చూసి పాపరాజీలు, నెటిజన్స్ 'ఈమె హాట్‌గా లేదు, అందంగా లేదు' అంటూ కామెంట్ చేయడం వంటివి చేస్తే కోపం వస్తుందని జాన్వీ కపూర్ చెప్పుకొచ్చింది. తన గురించి ఇతరులు మాట్లాడుకోవడం పర్వాలేదు కానీ, తన గురించి పదే పదే నెగిటివ్‌గా మాట్లాడుకోవడం కోపం తెప్పిస్తుందని జాన్వీ కపూర్ అంది. తాను ఎన్నో ఫోటో షూట్స్‌లో హాట్‌గా అందంగా కనిపించాను. కొన్ని ఫోటోలను యాంగిల్ లేకుండా తీసి, ఇష్టానుసారంగా పోస్ట్ చేసిన పాపరాజీల ఫోటోలను చూసి కొందరు హాట్‌గా లేదని వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం కరెక్ట్ కాదు అన్నట్లుగా జాన్వీ కపూర్ అసహనం వ్యక్తం చేసింది. కంఫర్ట్ లేకుండా రకరకాల యాంగిల్స్ నుంచి ఫోటోలు తీయడం అనేది ఇబ్బందిగా అనిపిస్తుంది. ఆ ఫోటోలను వారు హాట్‌గా లేదని కామెంట్ పెట్టి పోస్ట్ చేయడంను జాన్వీ కపూర్ తప్పుబట్టింది. జాన్వీ కపూర్ గత ఏడాది మూడు హిందీ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ మూడు సినిమాలు సైతం తీవ్రంగా నిరాశ పరిచాయి. గత ఏడాది జాన్వీ కపూర్‌కి శృంగార తారగా మరింత గుర్తింపు దక్కింది. కానీ ఎప్పటిలాగే హిట్ మాత్రం దక్కలేదు. కానీ జాన్వీ కపూర్ ఈ ఏడాది పై చాలా ఆశలు పెట్టుకుంది. ఒకటి రెండు బాలీవుడ్ సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. మరో వైపు రామ్ చరణ్ తో నటించిన పెద్ది సినిమా విడుదలకు ముస్తాబు అవుతుంది. బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో జాన్వీ కపూర్ పాత్రకు ఎక్కువ ప్రాధాన్యత ఉండబోతున్నట్లుగా ఇప్పటి వరకు విడుదలైన పాటలను బట్టి అర్థం అవుతుంది. ఇప్పటికే జాన్వీ కపూర్ లుక్‌కి, ఆమె యొక్క బాడీ లాంగ్వేజ్‌కి మంచి స్పందన వచ్చింది. సినిమా హిట్ అయితే జాన్వీ కపూర్ టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా, అత్యధిక పారితోషికం తీసుకునే హీరోయిన్‌గా మారే అవకాశం ఉంది. మరో వైపు బాలీవుడ్‌లోనూ ఈమె బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## శేష్ పంచ్.. ఆ హీరో ఫీలయ్యారా?



టాలీవుడ్ యంగ్ హీరోల మధ్య పోటీ, పోలికలు ఎప్పుడూ చర్చనీయాంశంగానే ఉంటాయి. తాజాగా అడివి శేష్ చేసిన కొన్ని వ్యాఖ్యలు, వేసిన పంచులు హాట్ టాపిక్ గా మారాయి. ఆయన చేసిన కామెంట్స్ వల్ల మరో యంగ్ హీరో గురించి ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఆ వ్యాఖ్యలతో సంబంధం లేకపోయినా, కొందరు ఓ హీరో పేరును లాగడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. విభిన్న కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న అడివి శేష్, హీరోగా మాత్రమే కాకుండా రైటర్ గా సినిమాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న డెకాయిట్ ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ లో భాగంగా ఓ పోడ్ కాస్ట్ లో పాల్గొన్న శేష్ పలు వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఓ యంగ్ హీరో గురించి చేసిన కామెంట్స్ చర్చకు దారితీశాయి. "ఓ యాక్టర్ పేరు చెప్పను. నా ప్రొడ్యూసర్ బర్త్ డే సందర్భంగా కలిశా. 'నువ్వు నా కంటే పెద్ద సినిమా చేశావు' అన్నట్టుగా షేక్ హ్యాండ్ ఇచ్చాడు. అతను చెప్పింది తెలుగులో చెబితే ఎవరో అర్థమైపోతుంది. అందుకే ఇంగ్లీష్ లో చెబుతున్నా" అని శేష్ అన్నారు. ఆ మాటలు విన్నప్పుడు అదొక రకమైన పోలికల పోటీలా అనిపించిందని చెప్పారు. "యంగ్ హీరోల్లో టాప్ అవ్వాలనుకుంటే ముందు పెద్ద హీరోలు ఉన్నారు. వారిని దాటాలని అనుకుంటే రజనీకాంత్, చిరంజీవి లాంటి లెజెండ్స్ ఉన్నారు. వారిని మించి వెళ్లాలని అనుకుంటే షారుఖ్ ఖాన్ ఉన్నారు.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma